VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : గురువారం 18.06.2026

సంపుటి : 08 సంచిక : 09 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



3

**ఖరీఫ్‌కు పకడ్బందీ సన్నాహాలు.. వరుస సమీక్షలతో మంత్రి తుమ్మల**




# తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్రానికి ఆదర్శం: సీఎం రేవంత్ రెడ్డి

- విద్యా వ్యవస్థ ప్రక్షాళనకే విద్యా కమిషన్ ఏర్పాటు
- ప్రభుత్వ బడులపై ఉన్న అపోహలు తొలగించడమే లక్ష్యం
- అసమానతల నిర్మూలనకు నాణ్యమైన విద్యే మార్గమన్న సీఎం
- కుల ప్రాతిపదిక పాఠశాలలకు బదులు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- ప్రభుత్వ బడుల నుంచే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభం
- విద్యా కిట్ల టెండర్లపై అవినీతి ఆరోపణలను ఖండించిన సీఎం
- విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతామన్న రేవంత్





**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 17:**

రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో రూ.15 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఆధునిక లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్ తదితర సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి, పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంలో విద్యార్థులతో సరదాగా ఫుట్‌బాల్ ఆడారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు రూ.27 వేల కోట్లు విద్యాశాఖపైనే ఖర్చు చేస్తున్నామని తెలిపారు. విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై తల్లిదండ్రుల్లో కొన్ని అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టామని పేర్కొన్నారు. విద్య మాత్రమే వ్యక్తుల జీవితాలను సమూలంగా మార్చగల శక్తి కలిగిన సాధనమని, సమాజంలో అసమానతలు తొలగాలంటే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందాల్సిన అవసరం ఉందన్నారు. ▶ మిగతా 6లో

## సోలార్ ప్లాంట్ పెట్టండి... లాభాలు ఆర్జించండి



2

- ఏటా రూ.50 లక్షలు ఆర్జించే అవకాశం
- నాబార్డు ద్వారా రుణం పొందండి
- సక్రమంగా ఈఎంఐ చెల్లిస్తే 1 శాతం వడ్డీకే రుణాలు

## ముఖ్యమంత్రితో భేటీ అయిన మంచాల సర్పంచ్ మానస వినయ్

- మంచాల మండల అభివృద్ధికి నాంది పలికిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం



6

## జీ7 సదస్సులో మోదీ-మెలోని హల్చల్



8

- "ఇన్‌స్టాలో మనమే పాపులర్ జంట"
- మోదీపై ఇటలీ ప్రధాని సరదా వ్యాఖ్యలు
- ప్రపంచ సవాళ్లపై గర్జించిన దేశాధినేతలు
- సోషల్ మీడియాను ఊపేస్తున్న సరదా సంభాషణ
- "పొగ తాగడం మానేశా.. ఎవరినీ చంపాలని లేదు" మెలోని జోకులు
- అంతర్జాతీయ మాఫియా, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై జీ7 యుద్ధం
- జాతీయ భద్రతకు డ్రగ్స్ నెట్‌వర్క్ పెద్ద ముప్పు: సంయుక్త ప్రకటన

## గుడిసెలు లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- రెండో విడత ఇందిరమ్మ ఇండ్లలో గుడిసెల వాసులకే తొలి ప్రాధాన్యత



4

- యుద్ధప్రాతిపదికన క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి అర్హుల ఎంపిక
- రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం కింద రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం

## వచ్చేది మన ప్రభుత్వమే..

- మళ్లీ సీఎంగా కేసీఆర్ ఖాయం
- ఖమ్మం వేదికగా కేటీఆర్ వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ శ్రేణులకు కీలక దిశా నిర్దేశం
- సర్ ప్రక్రియపై ప్రతి బీఎల్ఏ అప్రమత్తంగా ఉండాలి
- ఖమ్మం జిల్లాలో 'ఘరానా దొంగల' పాలన సాగుతోంది



2

## ఎస్సీ కార్పొరేషన్ నుంచి ఒక్కరికీ రుణం ఇవ్వలేదు: హరీశ్‌రావు

- హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ అవగాహన సదస్సు
- గత 30 నెలల్లో ఎస్సీలకు రుణాలు అందలేదని విమర్శ
- ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల నిధులకు కేసీఆర్ చట్టం చేశారని వ్యాఖ్య
- ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించామని గుర్తుచేసిన హరీశ్
- తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించిన ఘనత బీఆర్ఎస్‌దేనని వెల్లడి
- పోడు భూములకు పట్టాలు, రైతుబంధు ఇచ్చామని స్పష్టం




- గిరిజనులను అక్కున చేర్చుకున్న ప్రభుత్వం కేసీఆర్‌దేనని వ్యాఖ్య
- తెలంగాణ కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరం రాజీనామా చేశామని గుర్తుచేత
- రేవంత్ రాజీనామా పేరుతో జిరాక్స్ పేపర్ ఇచ్చారని విమర్శ

2

## హర్మూజ్ జలసంధి మాదే

- ఇరాన్ సంచలన ప్రకటన..
- జెనీవా వేదికగా ముగింపు అంకం
- అంతర్జాతీయ సురక్షిత నౌకాయానానికి ఇరాన్ సేవలు
- ఇరాన్ అణు నిరోధకతపై జేడీ వాన్స్ స్పష్టత
- 24 బిలియన్ డాలర్ల నిధుల బదిలీ వార్తలపై అమెరికా ఖండన
- యురేనియం సుసంపన్నీకరణ కార్యక్రమాలను నిలిపివేత
- జెనీవా వేదికగా చారిత్రాత్మక శాంతి ఒప్పందంపై సంతకాలు
- పశ్చిమాసియాలో తగ్గనున్న ఉద్రిక్తతలు

2

## కరిక్యులం ఎంపిక రాష్ట్రాల హక్కు: కేరళ సీఎం

- పాఠశాల విద్యలో కేంద్ర జోక్యం ఉండకూడదన్న సతీశన్
- పీఎం శ్రీ పథకంపై అధ్యయనానికి ఉపకమిటీ ఏర్పాటు



6

## రూ.2 వేల కోట్ల అవినీతి నిరూపిస్తే రాజీనామా చేస్తాం: మంత్రుల సవాల్

6

- హరీశ్‌రావుకు పొన్నం, అడ్లూరి లక్ష్మణ్ సవాల్

# సోలార్ ప్లాంట్ పెట్టండి...లాభాలు ఆర్జించండి

- సహకార సంఘాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు
- వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడి
- జన ఔషధి కేంద్రాలను వినియోగించుకోవాలని పిలుపు

**చొప్పదండి వెలుతురు జూన్ 17**



సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించే అవకాశం ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. 1 మెగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఒక్కో సోలార్ ప్లాంట్ ద్వారా ఏటా రూ.50 లక్షల ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు నాబార్డు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. సక్రమంగా ఈఎంఐ చెల్లించే సహకార సంఘాలకు 1 శాతం వడ్డీకే రుణాలు లభిస్తాయన్నారు. బుధవారం రోజున చొప్పదండి పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తొలుత జన ఔషధి కేంద్రాన్ని సందర్శించారు. జన ఔషధి కేంద్రానికి వస్తున్న ఆదరణపై ఆరా తీశారు. అతి తక్కువ ఖర్చుతో జన ఔషధిలో మందులు అందుబాటులో ఉన్నాయని, వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. అనంతరం చొప్పదండి శివారులో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ సందర్శించారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అయిన ఖర్చు, రుణం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.

**ఆ ప్రకటనలోని ముఖ్యాంశాలు...**

పీఎం కుసుం పథకంలో భాగంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన వ్యయంలో 80 శాతానికిపైగా నాబార్డు రుణ సౌకర్యం కల్పిస్తోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తొలిసారి చొప్పదండిలోనే సోలార్ ప్లాంట్ ఏర్పాటు కావడం అభినందనీయం. ఈ ప్లాంట్ ధ్వారా 1 మెగావాట్ కరెంట్ ను ఉత్పత్తి చేయవచ్చు. ఒక్కో యూనిట్ ను 3 రూపాయల చొప్పున విద్యుత్ డిస్కంలు కొనుగోలు చేస్తాయి.వాస్తవానికి 1 మెగావాట్ ఉత్పత్తి కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చు 3 కోట్ల 80 లక్షల రూపాయలు. సహకార సంఘం 40 లక్షలు వెచ్చించాలి. మిగిలిన 3 కోట్ల 40 లక్షల రూపాయలను నాబార్డ్ సంస్థ రుణం రూపంలో ఇస్తోంది. వడ్డీ 4 శాతం. ఒకవేళ సక్రమంగా ఈఎంఐ చెల్లిస్తే 3 శాతం వడ్డీని తిరిగి చెల్లిస్తుంది. అంటే ఒక శాతానికే లోన్ వచ్చినట్లవుతుంది. సోలార్ ప్లాంట్ ద్వారా ఒక్కో సహకార సంఘానికి ఏటా 50 లక్షల ఆదాయం సంపాదించే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 5 సోలార్ ప్లాంట్లు మాత్రమే ఏర్పాటయ్యాయి. అందులో కరీంనగర్ లోని చొప్పదండిలో ఏర్పాటైంది కాగా మిగిలినవి పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటయ్యియి. రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘాలు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని ఆదాయం సమకూర్చుకోవాలి. కేంద్రం అన్ని విధాలా సహకరిస్తుంది. ఒకవేళ ఎవరైనా వ్యక్తిగతంగా పెట్టుకుంటే 9 శాతం వడ్డీతో రుణం లభిస్తుది. సక్రమంగా కడితే 3 శాతం మినహాయింపు ఉంటుంది. సోలార్ ప్లాంట్ పెట్టుకోవాలంటే 3 ఎకరాల స్థలం అవసరం. తద్వారా 1 మెగావాట్ కరెంట్ ఉత్పత్తి అవుతుంది. ఏటా పెద్ద ఎత్తున ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉంది. భూమి లభ్యత కలిగిన వారు వెంటనే సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలి.

# ఎస్సీ కార్పొరేషన్ నుంచి ఒక్కరికీ రుణం ఇవ్వలేదు: హరీశ్‌రావు

- తెలంగాణ ఉద్యమంలో పోరాడని వ్యక్తి సీఎం అయ్యారని వ్యాఖ్య

**హుస్నాబాద్ వెలుతురు జూన్ 17:**



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గత 30 నెలల్లో ఒక్క లబ్ధిదారుడికి కూడా రుణం ఇవ్వలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల నిధుల వినియోగానికి సంబంధించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చట్టబద్ధమైన వ్యవస్థను తీసుకొచ్చారని తెలిపారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించి స్వయం పాలనకు అవకాశం కల్పించామని చెప్పారు.పోడు భూములకు హక్కు పత్రాలు అందించి, రైతుబంధు పథకాన్ని కూడా వర్తింపజేసి గిరిజనులను అభివృద్ధి బాటలో నడిపించామని హరీశ్‌రావు అన్నారు. గిరిజనులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేసిందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ రాజీనామాలు చేసి ఉద్యమంలో భాగస్వాములయ్యారని హరీశ్‌రావు గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా రాజీనామా చేశానని చెప్పినా, స్పీకర్‌కు జిరాక్స్ పేపర్ మాత్రమే ఇచ్చారని విమర్శించారు. తెలంగాణ కోసం ఎప్పుడూ పోరాడని వ్యక్తి నేడు ముఖ్యమంత్రి అయ్యారని వ్యాఖ్యానించారు.ప్రస్తుత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం లేదని ఆరోపించిన హరీశ్‌రావు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమానికి అండగా పవన్ కళ్యాణ్

**హన్మకొండ:**

అరుదైన వ్యాధితో బాధపడుతున్న తన అభిమాని నిరంజన్‌ను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరామర్శించారు. హన్మకొండలోని నిరంజన్ నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. తల్లిదండ్రులను ఓదార్చి అవసరమైన సహకారం అందిస్తానంటూ భరోసా ఇచ్చారు. నిరంజన్ అనారోగ్యం విషయం తెలుసుకున్న వెంటనే అతడి ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ వేంకటేశ్వర స్వామి తీర్థప్రసాదాలను స్వయంగా అందజేశారు. అనంతరం భద్రకాళి దేవాలయంను సందర్శించి నిరంజన్ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ మానవీయ స్పందనపై కుటుంబ సభ్యులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



# హర్మ్యూజ్ జలసంధి మాదే

- అంతర్జాతీయ సమాజంలో నెలకొన్న ఆసక్తి

**టెహ్రాన్ వెలుతురు జూన్ 17:**

అంతర్జాతీయ రాజకీయ యవనికపై దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న అమెరికా–ఇరాన్ శత్రుత్వానికి తెరపడబోతోంది. ఇరు దేశాల మధ్య దౌత్య పరమైన చర్చలు ముగిసి, ఒక చారిత్రాత్మక శాంతి ఒప్పందం కుదిరేందుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. పశ్చిమాసియాలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా శాంతి స్థాపనకు ఈ ఒప్పందం ఎంతో కీలకమని భావిస్తున్న తరుణంలో, ఇరాన్ చేసిన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన, జీవనాడిగా భావించే 'హర్మ్యూజ్ జలసంధి' పూర్తిగా ఇరాన్ దేశానికే చెందుతుందని టెహ్రాన్ స్పష్టం చేసింది. ఒప్పందం తుది దశకు చేరిన వేళ ఇరాన్ ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ రెజా ఆరీఫ్ ఈ సంచలన వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.టెహ్రాన్‌లో జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో ఇరాన్ ప్రథమ ఉపాధ్యక్షుడు మహ్మద్ రెజా ఆరీఫ్ ప్రత్యేకంగా మాట్లాడారు. అంతర్జాతీయ ఇంధన వాణిజ్యంలో హర్మ్యూజ్ జలసంధి పోషిస్తున్న వ్యూహాత్మక పాత్రను ఆయన గుర్తు చేశారు. ఈ జలమార్గంపై ఇరాన్‌కు మాత్రమే సంపూర్ణ సార్వభౌమాధికారం, హక్కులు ఉన్నాయని నొక్కి చెప్పారు. దీని రక్షణ, రోజువారీ నిర్వహణ బాధ్యతలు ఎప్పటికీ ఇరాన్ పరిధిలోనే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ జలమార్గాన్ని వినియోగించుకునే అంతర్జాతీయ నౌకలు, ఇరాన్ అందిస్తున్న రక్షణ మరియు ఇతర సేవల ఖర్చులో భాగస్వాములు (రుసుము చెల్లించడం) కావాలని ఆయన సూచించారు.ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే చమురు, సహజ వాయువు (గ్యాస్) లో అత్యధిక శాతం కేవలం హర్మ్యూజ్ జలసంధి గుండానే ప్రయాణిస్తుందని ఆరీఫ్ పేర్కొన్నారు. ఇంతటి కీలకమైన మార్గంలో ప్రయాణించే వాణిజ్య నౌకల భద్రత కోసం ఇరాన్ సైన్యం నిరంతరం సేవలు అందిస్తోందని చెప్పారు. తాము తీసుకుంటున్న కఠినమైన భద్రతా చర్యలు గనుక లేకపోతే, నౌకలు సముద్రపు మైన్లు, తీవ్రమైన పర్యావరణ ప్రమాదాలు మరియు సముద్రపు దొంగల వంటి పెద్ద ముప్పులను ఎదుర్కోవాల్సి వచ్చేదని హెచ్చరించారు. ప్రపంచ నౌకాయాన వ్యవస్థ సజావుగా సాగడంలో ఇరాన్ పాత్రను అంతర్జాతీయ సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.మరోవైపు అమెరికా–ఇరాన్ శాంతి ఒప్పందంపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా వాషింగ్టన్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతిపాదిత దౌత్య ఒప్పందం ద్వారా ఇరాన్ భవిష్యత్తులో ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా పూర్తిగా నిరోధించవచ్చని ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ గనుక తన పాత పద్ధతులను, మొండి వైఖరిని మార్చుకుని అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడి ఉంటే, ఇరు దేశాల దౌత్య సంబంధాలలో ఒక సరికొత్త హరిత అధ్యాయం ప్రారంభమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం ప్రపంచ వ్యాపార, ఇంధన భద్రతకు ఎంతో మేలు చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ ఒప్పందంలో భాగంగా అమెరికా ప్రభుత్వం ఇరాన్‌కు పెద్ద ఎత్తున నిధులను అప్పనంగా ఇస్తోందంటూ వస్తున్న అంతర్జాతీయ వార్తలను జేడీ వాన్స్ తీవ్రంగా ఖండించారు. అమెరికా ఖజానా నుంచి ఇరాన్‌కు సుమారు 24 బిలియన్ డాలర్లు బదిలీ అవుతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చి చెప్పారు. అవన్నీ పూర్తిగా అవాస్తవాలని, తప్పుడు సమాచారమని స్పష్టం చేశారు. అమెరికా తన జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా ఎలాంటి ఆర్థిక లావాదేవీలకు ఒప్పుకోలేదని, కేవలం శాంతియుత వాతావరణం కోసమే ఈ ఒప్పందం జరుగుతోందని క్లారిటీ ఇచ్చారు.అమెరికాతో కుదిరిన అవగాహన ప్రకారం ఇరాన్ తన వద్ద ఉన్న అధికంగా సుసంపన్నం చేసిన అణు పదార్థాల (యురేనియం) నిల్వలను పూర్తిగా తొలగించేందుకు అంగీకరించిందని జేడీ వాన్స్ వెల్లడించారు. ఇరాన్ తన వివాదాస్పద యురేనియం సుసంపన్నీకరణ కార్యక్రమాలను తక్షణమే నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. దీనితో పాటు, ఐక్యరాజ్యసమితికి చెందిన అణు ఇంధన సంస్థల కఠినమైన అంతర్జాతీయ తనిఖీలకు, నిరంతర పర్యవేక్షణకు ఇరాన్ సహకరించాలని స్పష్టం చేశారు. ఈ ప్రాథమిక నిబంధనలను ఇరాన్ పాటిస్తేనే, ఒప్పందం ద్వారా లభించే ఇతర ఆర్థిక మినహాయింపులు లేదా ప్రయోజనాలు అమలులోకి వస్తాయని అమెరికా తేల్చి చెప్పింది.అమెరికా–ఇరాన్ దేశాల మధ్య కుదిరిన ఈ చారిత్రాత్మక ఒప్పందానికి సంబంధించిన అధికారిక సంతకాల కార్యక్రమం ఈ వారంలోనే స్విట్జర్లాండ్‌లోని జెనీవా నగరంలో వైభవంగా జరగనుంది. ఈ అంతర్జాతీయ దౌత్య ప్రక్రియకు స్విట్జర్లాండ్ ప్రభుత్వం ప్రధాన సమన్వయకర్తగా వ్యవహరిస్తోంది. ఈ మైలురాయి లాంటి కార్యక్రమానికి అమెరికా, ఇరాన్ ప్రతినిధులతో పాటు మధ్యవర్తిత్వం వహించిన పొరుగు దేశాలైన పాకిస్థాన్, ఖతార్ దేశాల ఉన్నతాధికారులు కూడా హాజరుకానున్నారు. ఈ నాలుగు దేశాల భాగస్వామ్యంతో జెనీవా వేదికగా ఒప్పంద పత్రాలపై ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేయనున్నారు.గడిచిన కొన్ని దశాబ్దాలుగా పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) లో నెలకొన్న ఉద్రిక్తతలకు, యుద్ధ వాతావరణానికి ఈ ఒప్పందం ద్వారా అడ్డుకట్ట పడుతుందని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన ఈ నూతన అవగాహన వల్ల గల్ఫ్ ప్రాంతంలో భద్రత పెరుగుతుందని, ఇరు దేశాల మధ్య ఆంక్షలు తొలగిపోతే వాణిజ్య రంగానికి ఊపు వస్తుందని అంచనా వేస్తున్నారు. పరస్పర విశ్వాసంతో ముందడుగు వేయడం ద్వారా రాబోయే రోజుల్లో ప్రాంతీయ స్థిరత్వం ఏర్పడుతుందని వివిధ దేశాల నేతలు ఆకాంక్షిస్తున్నారు.ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాను శాసించే హర్మ్యూజ్ జలసంధిపై ఇరాన్ చేసిన తాజా వ్యాఖ్యలు మరియు అమెరికాతో కుదరబోయే అణు నియంత్రణ ఒప్పందం నేపథ్యంలో ప్రపంచ దేశాలన్నీ పశ్చిమాసియా వైపు ఆసక్తిగా చూస్తున్నాయి. ఇంధన భద్రత, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల స్థిరత్వం, అణు ఆయుధాల నియంత్రణ వంటి అత్యంత కీలకమైన అంశాలు ఈ ఒప్పందంతో ముడిపడి ఉన్నాయి. అమెరికా, ఇరాన్ దేశాలు కుదుర్చుకోబోయే ఈ చారిత్రాత్మక ఒప్పందం భవిష్యత్తులో అంతర్జాతీయ రాజకీయాలను ఎలా ప్రభావితం చేయబోతోందనే అంశంపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.



# వచ్చేది మన ప్రభుత్వమే..

- ఒకరు కబ్జాల మంత్రి.. మరొకరు అస్తవ్యస్త ఆర్థిక మంత్రి
- కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్ర ప్రగతే సజీవ సాక్ష్యం
- రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో లక్షల కోట్ల అప్పులు..
- రెవెన్యూ మంత్రి పొంగులేటిపై వీడియోల ప్రదర్శన
- సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని సూచన
- ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపు

**ఖమ్మం వెలుతురు జూన్ 17:**

తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న తరుణంలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పార్టీ కేడర్‌లో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. ఖమ్మం జిల్లాలో బుధవారం పర్యటించిన ఆయన, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో (బీఎల్ఏ) కీలక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ముసుగులో సాగుతున్న ప్రజావ్యతిరేక పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో ముందస్తు ఎన్నికలు వచ్చినా, గడువు ప్రకారం ఎన్నికలు జరిగినా మళ్లీ అధికారంలోకి వచ్చేది కచ్చితంగా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.మరికొద్ది రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ లేదా ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏ) అత్యంత అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ ఆదేశించారు. అధికార పార్టీ ఓటర్ల జాబితాలో తమకు అనుకూలంగా మార్పులు చేసుకునేందుకు, బీఆర్ఎస్ సానుభూతిపరుల ఓట్లను అక్రమంగా తొలగించేందుకు కుట్రలు చేసే ప్రమాదం ఉందన్నారు. అర్హత గల ఏ ఒక్క వ్యక్తి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి గ్రామంలో, ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో గ్రౌండ్ లెవెల్ వెరిఫికేషన్ చేయాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాయకులకు దిశా నిర్దేశం చేశారు.ఖమ్మం జిల్లా ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో గజదొంగల పాలన నడుస్తుంటే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం ఘరానా దొంగల పాలన కొనసాగుతోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, ఖమ్మం ప్రజల ప్రయోజనాలను పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు. దాచుకోవడం, దోచుకోవడం తప్ప ఈ ముగ్గురు మంత్రులు జిల్లా అభివృద్ధికి పైసా పని కూడా చేయలేదని విమర్శించారు. కేవలం తమ స్వార్థ రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసమే అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.ఖమ్మం జిల్లా మంత్రుల శాఖల పనితీరును కేటీఆర్ లెక్కలతో సహా ఎండగట్టారు. జిల్లాకు చెందిన ఒక మంత్రి పూర్తిగా భూముల కబ్జాలకే పరిమితమయ్యారని, పేదల భూములను అక్రమంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. మరోవైపు వ్యవసాయ శాఖను చూస్తున్న మంత్రి చేతగానితనం వల్ల నేడు తెలంగాణలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందని, రైతులకు పెట్టుబడి సాయం అందక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రాష్ట్ర ఆర్థిక మంత్రి తన అసమర్థ విధానాలతో తెలంగాణ ఆర్థిక పరిస్థితిని పూర్తిగా అస్తవ్యస్తం చేసి, జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి తెచ్చారని విమర్శించారు.బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ అప్పులు చేశారంటూ నిరంతరం విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ హయాంలో చేసిన ప్రతి రూపాయి అప్పుకు తెలంగాణలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్ష్యంగా నిలిచిందన్నారు. కాళేశ్వరం లాంటి ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం, 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ




తాగునీరు, అద్భుతమైన జాతీయ రహదారులు, ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలు.. ఇవన్నీ కేసీఆర్ చేసిన అప్పులతోనే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. ఆ అప్పులు రాష్ట్ర సంపదను పెంచడానికి ఉపయోగపడ్డాయని స్పష్టం చేశారు.గడిచిన రెండున్నరేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం దేనికోసం లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తెచ్చిన నిధులను వాడుకుంటూ, కొత్తగా మళ్లీ అప్పుల కుప్పగా మార్చిన ఈ ప్రభుత్వం రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజెక్టునైనా నిర్మించిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ చేసిన అప్పులన్నీ కేవలం వారి అవినీతి జేబుల్లోకి, ఢిల్లీకి మూటలుగా వెళ్లాయే తప్ప రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి లక్ష్యంగా కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. రెవెన్యూ శాఖను అడ్డం పెట్టుకుని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పెద్ద ఎత్తున భూ దందాలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇందుకు సంబంధించిన పక్కా ఆధారాలు, వీడియో దృశ్యాలను ఖమ్మం సభా వేదికపైనే కేటీఆర్ ల్యాప్‌టాప్ ద్వారా స్క్రీన్‌లపై ప్రదర్శించి రచ్చ లేపారు. అధికార బలంతో విచ్చలవిడిగా సాగుతున్న ఈ అక్రమాలను న్యాయపరంగా, రాజకీయంగా ఎండగడతామని, బాధ్యులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.పార్టీ బలోపేతం కోసం బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'డిజిటల్ సభ్యత్వ నమోదు' కార్యక్రమాన్ని జిల్లాలో ఉధృతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ ఆధునిక సభ్యత్వ నమోదు ప్రక్రియలో యువతీ యువకులు, సోషల్ మీడియా యాక్టివిస్టులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించి, డిజిటల్ యాప్స్ ద్వారా సభ్యత్వాలను నమోదు చేయాలన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టం చేయడం ద్వారానే కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టగలమని కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, హామీల ఉల్లంఘనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ నిరంతర ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, ప్రజలు మోసపోయామని గ్రహించారని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడే ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని, కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఖమ్మం జిల్లా నుంచే కాంగ్రెస్ పతనం ప్రారంభం కావాలని, రాబోయే రోజుల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని కేటీఆర్ ముగించారు.

# ఖరీఫ్‌కు పకడ్బందీ సన్నాహాలు.. వరుస సమీక్షలతో మంత్రి తుమ్మల

- **సాంకేతికతతో సాగుకు కొత్త దిశ - మంత్రి తుమ్మల**
- **ప్రభుత్వం సూచించిన 7 వరి రకాలకే ప్రాధాన్యం.. కంపెనీలకు మంత్రి తుమ్మల ఆదేశం**
- **యూరియా యాప్ పై వివిధ జిల్లాల నుండి వచ్చిన అధికృత డీలర్ల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించిన మంత్రి తుమ్మల**

**హైదరాబాద్, వెలుతురు జూన్ 17:**

నిన్న ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై నిర్వహించిన సమీక్షా సమావేశం నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సచివాలయంలో వరుస సమీక్షా సమావేశాలు నిర్వహించారు. విత్తన కంపెనీల ప్రతినిధులు, ఎరువుల డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, కృషి వాస్ ప్రతినిధులతో విడివిడిగా సమావేశమై ఖరీఫ్ సీజన్ ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు.

ప్రభుత్వం సూచించిన ఏడు వరి రకాల విత్తనాలకే ప్రాధాన్యంః

విత్తన కంపెనీలతో జరిగిన సమావేశంలో మార్కెట్ డిమాండ్, మిల్లర్ల సూచనలు, ఎగుమతి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు వరి రకాల విత్తనాల లభ్యతపై మంత్రి తుమ్మల సమీక్షించారు. బీపీటీ–5204 (సాంబమసూరి), ఆర్ఎన్ఆర్–15048 (తెలంగాణ సొన), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం–1638 (కూనారం సన్నలు), డబ్ల్యూజీఎల్–44 (సిద్ధి), కేఎన్ఎం–7715 రకాల విత్తనాలను రైతులకు విస్తృతంగా అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఈ రకాల వరికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో పాటు ఎగుమతులకు కూడా అవకాశాలు ఉన్నాయని, ముఖ్యమంత్రి కూడా వీటి సాగును ప్రోత్సహించాలని సూచించినట్లు మంత్రి తెలిపారు. గతంలో రాష్ట్రంలో దొడ్డు రకాల సాగు 60 శాతం, సన్న రకాల సాగు 40 శాతం ఉండేదని, ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించిన తర్వాత పరిస్థితి మారి ప్రస్తుతం సన్న రకాల సాగు 60 శాతానికి చేరుకుందని వివరించారు.ప్రభుత్వం సూచించిన విత్తనాలను రైతులకు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని కంపెనీలకు ఆదేశించారు. రైతులకు విత్తనాల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదని స్పష్టం చేశారు. ఈ రకాలను ఏ రైతు ఎంత విత్తనం కొనుగోలు చేశాడనే వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలని ఆదేశించారు.

విత్తన సబ్సిడీపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుందని, వ్యవసాయ యాంత్రీకరణ పథకం తరహాలో సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విత్తనాల పంపిణీ కోసం అవసరమైతే రైతు వేదికలను ప్రత్యేక కేంద్రాలుగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందని చెప్పారు.ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఈ ఏడు వరి రకాలకే బోనస్ వర్తిస్తుందని స్పష్టం చేసిన మంత్రి, కంపెనీల వారీగా అందుబాటులో ఉన్న విత్తనాల నిల్వలను రైతులకు తెలిసేలా ప్రదర్శించాలని సూచించారు. అదేవిధంగా ఆయా రకాల అమ్మకం, విక్రయాలను రోజువారీగా అప్ డేట్ చేయాల్సిందిగా డీలర్లను ఆదేశించారు.

**ఎరువుల సరఫరాలో రైతులకు ఇబ్బందులు రాకూడదుః**

ఫెర్టిలైజర్ డీలర్లతో జరిగిన సమావేశంలో ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల సరఫరా, పంపిణీ అంశాలపై మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ వినియోగదారులకు, డీలర్లకు అనుకూలంగా ఉందని డీలర్లు అభిప్రాయపడ్డారు. రైతులకు ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం ప్రభుత్వంతో పాటు డీలర్ల బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. అవసరమైతే రైతు వేదికలను తాత్కాలిక విక్రయ కేంద్రాలుగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు.దేశంలోనే తొలిసారిగా భూమికి అనుసంధానం చేసి, సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియా పంపిణీ చేసే విధంగా తెలంగాణ ప్రభుత్వం యూరియా యాప్‌ను రూపొందించిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ అమలు చేస్తున్న ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు కూడా పైలట్ ప్రాతిపదికన అములకు సన్నాహాలు చేస్తున్నాయని చెప్పారు. సాంకేతికతను వినియోగించి సరైన రైతుకు, సరైన పరిమాణంలో యూరియా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.గతంలో కేవలం ఆధార్ కార్డు చూపించి పెద్ద మొత్తంలో యూరియా కొనుగోలు చేసే అవకాశం ఉండేదని, ప్రస్తుతం యాప్ ఆధారిత విధానంతో అలాంటి పరిస్థితులకు పూర్తిగా అడ్డుకట్ట పడిందని చెప్పారు. అధిక యూరియా వినియోగం వల్ల కలిగే నష్టాలపై డీలర్లు కూడా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా యూరియా దిగుమతులపై ప్రభావం పడుతున్నప్పటికీ రాష్ట్ర రైతులకు అవసరమైన ఎరువులు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా యాప్ పనితీరు పట్ల పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేసిన డీలర్లు, మండలాల వారీగా మ్యాపింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. అలాగే రవాణా ఖర్చులు తమపై అదనపు భారం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న రవాణా వ్యయాల కారణంగా రిటైల్ వ్యాపారులు అధిక ధరలకు యూరియా విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాక యాప్ వచ్చిన తరువాత ఎక్కడా రద్దీ సమస్య లేదని, రైతులు వారికి సౌకర్యవంతమైన సమయంలో వచ్చి బస్తాలు కొనుగోలు చేస్తున్నారని మంత్రికి తెలియచేశారు. ఈ యాప్ తెచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.



**శాటిలైట్ సాంకేతికతతో చీడపీడల గుర్తింపుః**

కృషి వాస్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో వినియోగించే విధానాలపై మంత్రి తుమ్మల సమీక్షించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా పంటల్లో చీడపీడలను, వ్యాధులను రియల్ టైమ్‌లో గుర్తించి, అవి విస్తరించకముందే రైతులకు సమాచారం అందించే విధంగా కృషి వాస్ ప్రాజెక్ట్ పనిచేస్తోందని కంపెనీ ప్రతినిధులు వివరించారు.ఈ విధానం ద్వారా రైతులు ప్రతిరోజూ పొలాల్లో తిరిగి వ్యాధులను గుర్తించాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. రైతులకు ముందస్తు హెచ్చరికలతో పాటు అవసరమైన పురుగుమందులపై సూచనలు కూడా అందించడంతో వ్యాధుల వ్యాప్తిని నివారించి దిగుబడులను కాపాడుకోవచ్చని చెప్పారు.ఈ ప్రాజెక్టు పైలట్ అమలుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలాన్ని ఎంపిక చేసినట్లు ప్రతినిధులు వివరించారు. అక్కడి రైతులకు ఇప్పటికే పంటల పరిస్థితులపై సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కృషి వాస్ సేవల ద్వారా లబ్ధి పొందిన దమ్మపేట మండలం అంకంపాలెం గ్రామానికి చెందిన పెరుమళ్ళ వీరభద్రరావు అనే రైతుకు మంత్రి తుమ్మల స్వయంగా ఫోన్ చేసి, ప్రాజెక్టు వల్ల కలిగిన ప్రయోజనాలు మరియు కంపెనీ తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. కంపెనీ వారు ఉపయోగించిన సాంకేతికత, యూనివర్సిటీ ప్రస్తుతం ఉపయోగిస్తున్న సాంకేతికతలో తారతమ్యాలని యూనివర్సిటీ అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచంలో ఉన్న ఉత్తమ సాంకేతికతను మన తెలంగాణ రైతులకు అందుబాటులోకి తేవాలన్నది తమ ప్రభుత్వ ధ్యేయమని, ఈ పంట కాలానికి సాంకేతిక ఫలాలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశాల్లో సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ రాజ్, సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ యాస్మిన్ బాషా, అగ్రికల్చర్ యూనివర్సిటీ విసి అల్దాస్ జానయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యువతకు అంతర్జాతీయ విద్యా అవకాశాలపై చర్చ

- **చిచెస్టర్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక సమావేశం**
- **చిచెస్టర్ యూనివర్సిటీలో కోచులకు ఇచ్చే శిక్షణ, క్రీడాకారులకు నైపుణ్యతపై అవగాహన, స్కిల్ డెవలప్మెంట్ వంటి అంశాలపై మంత్రి వాకిటి శ్రీహరి గారితో చర్చించారు**

**హైదరాబాద్, వెలుతురు జూన్ 17:**



తెలంగాణ యువతకు ప్రపంచ స్థాయి విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రతిష్ఠాత్మక చిచెస్టర్ విశ్వవిద్యాలయం ప్రతినిధులతో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామిక అభివృద్ధి, మత్స్య, క్రీడలు & యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యా సహకారం, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, ఉన్నత విద్యా అవకాశాలపై విస్తృతంగా చర్చించారు.హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం మరియు చిచెస్టర్ విశ్వవిద్యాలయం మధ్య విద్యా, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పరస్పర సహకార అవకాశాలను పరిశీలించారు. రాష్ట్ర యువత అంతర్జాతీయ స్థాయి విద్యను అందిపుచ్చుకుని ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌లో పోటీపడేలా భాగస్వామ్య కార్యక్రమాలు రూపొందించాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రతినిధులు తమ విద్యా కార్యక్రమాలు, పరిశోధన అవకాశాలు, అంతర్జాతీయ విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ప్రత్యేక పథకాలు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాల గురించి వివరించారు. తెలంగాణ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య, గ్లోబల్ ఎక్స్‌పోజర్ కల్పించేందుకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి చిచెస్టర్ విశ్వవిద్యాలయ ప్రతినిధులను శాలువాతో సన్మానించి అభినందించారు.ఈ సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, చిచెస్టర్ విశ్వవిద్యాలయ ప్రతినిధి ఒలివియా మెక్‌లాగ్లిన్, సంబంధిత శాఖల అధికారులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# జగిత్యాల అభివృద్ధిపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి: భోగ శ్రావణి

**జగిత్యాల, వెలుతురు జూన్ 17:**

జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి డిమాండ్ చేశారు. కమల నిలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారిక కార్యక్రమాల్లో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను విస్మరించడం సరికాదన్నారు. కేంద్ర విద్యాలయానికి స్థల కేటాయింపును అడ్డుకుంటున్నది ఎవరో ప్రజలకు తెలియజేయాలని కోరారు. అమృత్ 2.0 పథకం కింద జగిత్యాల, రాయికల్‌కు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. యావర్ రోడ్ విస్తరణ విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ఆరోపణలకు ప్రాధాన్యం ఇవ్వడం తగదన్నారు. చిల్లర రాజకీయాలు మానుకుని అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యేకు సూచించారు. ప్రజల ప్రయోజనాల కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.






# ప్రజా సమస్యలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శ

- **హిట్లర్ తనకు స్ఫూర్తి అని సీఎం చెప్పుకోవడం ఆయన నిజస్వరూపమన్న కేటీఆర్**
- **రాష్ట్రాన్ని సీఎం, మంత్రులు దోచుకుంటున్నారని ఆరోపణ**
- **పొంగులేటిపై భూకబ్జాల ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**
- **ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలిచేది బీఆర్ఎస్‌నేనని ధీమా**
- **కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపు**
- **ఓటరు జాబితా ప్రక్షాళనపై అప్రమత్తంగా ఉండాలని సూచన**
- **ఒక్క ఓటు కూడా పోకుండా కాపాడుకోవాలని పిలుపు**
- **కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, నేతల పాల్గొనిక**

**ఖమ్మం వెలుతురు జూన్ 17:**

రాష్ట్రంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సిన ప్రభుత్వం వారి నివాసాలను కూల్చివేస్తూ పైశాచిక ఆనందం పొందుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని వెంకటగిరి వద్ద బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అంశంపై పార్టీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. హిట్లర్ తనకు స్ఫూర్తి అని ముఖ్యమంత్రి చెప్పుకోవడం ఆయన అసలు స్వభావాన్ని ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకోవడంపైనే దృష్టి కేంద్రీకరించిందని విమర్శించారు.రెవెన్యూ మంత్రి పొంగులేటి భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నవారు ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం బీఆర్ఎస్‌దేనని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు అంకితభావంతో పనిచేసి ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియపై ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఒక్క ఓటు కూడా పోకుండా కాపాడుకోవడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు.



# ఆకాశాన్ని దాటిన అడుగు

- **1983 జూన్ 18న సాలీ రైడ్ అంతరిక్షంలోకి వెళ్లిన తొలి అమెరికన్ మహిళగా చరిత్ర సృష్టించిన సందర్భంగా**

ప్రతి యుగానికి కొన్ని సంఘటనలు ఉంటాయి. అవి కేవలం ఒక రోజు వార్తగా మాత్రమే మిగలవు; తరాల ఆలోచనలను ప్రభావితం చేసే మైలురాళ్లుగా నిలుస్తాయి. 1983 జూన్ 18 అలాంటి రోజులలో ఒకటి. ఆ రోజు అమెరికన్ అంతరిక్ష యాత్రికురాలు సాలీ రైడ్ అంతరిక్షంలోకి ప్రవేశించి చరిత్ర సృష్టించింది. ప్రపంచం దానిని ఒక మహిళా విజయంగా చూసింది. కానీ ఆ సంఘటన అంతకంటే ఎంతో గొప్పది. అది శాస్త్రరంగంలో అవకాశాల ప్రజాస్వామ్యీకరణకు సంకేతం. ప్రతిభకు లింగం ఉండదనే సత్యానికి నిదర్శనం. సమాజం నిర్మించిన అనేక అదృశ్య గోడలను ఒక వ్యక్తి సంకల్పం ఎలా కూల్చగలదో చూపించిన అరుదైన సందర్భం. మానవ నాగరికత చరిత్రను పరిశీలిస్తే విజ్ఞానశాస్త్రం అనేది కేవలం ఆవిష్కరణల చరిత్ర కాదు; అది అవకాశాల కోసం జరిగిన పోరాటాల చరిత్ర కూడా. అనేక శతాబ్దాల పాటు విజ్ఞానం, సాంకేతికత, పరిశోధన రంగాలు కొద్ది వర్గాలకే పరిమితమయ్యాయి. మహిళలు విద్యకు దూరమయ్యారు. శాస్త్రవేత్తలుగా ఎదగడం, పరిశోధనలు చేయడం, నిర్ణయాత్మక స్థానాలకు చేరడం వారికి సులభం కాదు. సమాజం వారి సామర్థ్యాలపై అనుమానాలు వ్యక్తం చేసింది. కానీ చరిత్రలో ప్రతి మార్పు ఒక ప్రశ్నతో ప్రారంభమైంది. మహిళలు ఎందుకు చేయలేరు? వారికి అవకాశాలు ఎందుకు ఉండకూడదు? అనే ప్రశ్నలే ప్రపంచాన్ని ముందుకు నడిపించాయి.

సాలీ రైడ్ సాధన ఆ ప్రశ్నలకు ఒక సమాధానంగా నిలిచింది. ఆమె అంతరిక్షంలోకి వెళ్లినప్పుడు భూమి నుంచి లక్షలాది మంది బాలికలు ఆకాశం వైపు కొత్త దృష్టితో చూశారు. అంతరిక్షం అనేది పురుషుల ప్రపంచం కాదని, విజ్ఞానం అనేది ఎవరికీ సొంతం కాదని, కలలు కనడానికి కూడా సమాన హక్కు ఉండాలని ప్రపంచం గ్రహించడం ప్రారంభించింది. ఒక వ్యక్తి విజయం వెనుక ఒక సమాజం సాధించిన చైతన్యం దాగి ఉంటుంది. సాలీ రైడ్ ప్రయాణం వెనుక కూడా అదే చైతన్యం ఉంది.

ఈ రోజు మనం కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ కంప్యూటింగ్, అంతరిక్ష పరిశోధనలు, జీవసాంకేతికతల గురించి మాట్లాడుతున్నాం. కానీ ఒక ముఖ్యమైన ప్రశ్నను కూడా అడగాలి. ఈ అవకాశాలు అందరికీ అందుతున్నాయా? విజ్ఞానశాస్త్రం అందరికీ అందుబాటులో ఉన్నదా? గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలకు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు, సామాజిక పరిమితుల మధ్య జీవిస్తున్న యువతకు ఈ ప్రపంచం ఎంత వరకు తెరుచుకుంది? సాలీ రైడ్ జ్ఞాపకం ఈ ప్రశ్నలను మన ముందుకు తీసుకొస్తుంది.

భారతదేశం వంటి యువజన దేశానికి ఈ అంశం మరింత ప్రాధాన్యమైంది. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా భారత్ నిలుస్తోంది. ఈ యువశక్తిని విజ్ఞానం, పరిశోధన, ఆవిష్కరణల వైపు మళ్లించడం అత్యంత అవసరం. కానీ విద్యా వ్యవస్థలో ఇంకా అనేక అసమానతలు కనిపిస్తున్నాయి. పట్టణాలకు, గ్రామాలకు మధ్య అవకాశాల వ్యత్యాసం ఉంది. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు విద్యాసంస్థల మధ్య నాణ్యతా తేడాలు ఉన్నాయి. బాలికల ఉన్నత విద్యలో కూడా అనేక అడ్డంకులు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సాలీ రైడ్ కథ కేవలం ఒక చారిత్రక సంఘటన కాదు; అది విద్యా విధాన రూపకర్తలకు, పాలకులకు, సమాజానికి ఒక హెచ్చరిక కూడా.ఏ దేశమైనా తన భవిష్యత్తును నిర్మించుకోవాలంటే శాస్త్రీయ దృక్పథాన్ని బలోపేతం చేయాలి. విజ్ఞానం అంటే కేవలం ప్రయోగశాలలు కాదు; ప్రశ్నించే మనస్తత్వం. అనుమానించే ధైర్యం. ఆధారాల ఆధారంగా నిర్ణయాలు తీసుకునే సంస్కృతి. దురదృష్టవశాత్తూ నేటి ప్రపంచంలో శాస్త్రీయ ఆలోచనల కంటే అపోహలు, మూఢనమ్మకాలు, అసత్య ప్రచారాలు వేగంగా వ్యాపిస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా శాస్త్రీయ దృక్పథం అదే స్థాయిలో పెరగడం లేదు. అందుకే సాలీ రైడ్ వంటి వ్యక్తుల జీవితాలు మనకు కేవలం ప్రేరణ మాత్రమే కాదు; విజ్ఞానాన్ని సామాజిక విలువగా స్వీకరించాల్సిన అవసరాన్ని కూడా గుర్తుచేస్తాయి.ప్రపంచ వ్యాప్తంగా మహిళలు నేడు రాజకీయాలు, వ్యాపారం, క్రీడలు, సాహిత్యం, విజ్ఞానం వంటి అన్ని రంగాల్లో అసాధారణ విజయాలు సాధిస్తున్నారు. అయినప్పటికీ సమానత్వం ఇంకా పూర్తిగా సాధించబడలేదు. వేతనాల్లో అసమానతలు, అవకాశాల్లో వివక్ష, నిర్ణయాత్మక స్థానాల్లో తక్కువ ప్రాతినిధ్యం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. ఒక మహిళ అంతరిక్షంలోకి వెళ్లడం ఎంత గొప్పదో, ప్రతి బాలిక నిర్భయంగా పాఠశాలకు వెళ్లగలగడం కూడా అంతే గొప్ప విషయం. సమాన అవకాశాలు లేకుండా సాధికారత అసంపూర్ణంగానే మిగులుతుంది.సాలీ రైడ్ విజయాన్ని కేవలం మహిళా సాధికారత కోణంలో మాత్రమే చూడడం కూడా సరిపోదు. అది మానవ సామర్థ్యానికి ప్రతీక. ఒక సమాజం తన ప్రజలపై నమ్మకం ఉంచినప్పుడు వారు ఎంత ఎత్తుకు ఎదగగలరో చూపించిన ఉదాహరణ. అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అయితే, వాటిని వినియోగించుకునే వాతావరణం సృష్టించడం సమాజం బాధ్యత. పిల్లల కలలను లింగం, ప్రాంతం, కులం, ఆర్థిక స్థితి వంటి గోడలతో పరిమితం చేయకుండా ప్రోత్సహించడం కాలానుగుణ అవసరం.చరిత్రలో కొన్ని సంఘటనలు కాలంతో పాటు పాతబడిపోవు. అవి ప్రతి తరం కొత్త అర్థాలను అందిస్తాయి. సాలీ రైడ్ అంతరిక్ష యానం కూడా అలాంటిదే. నలభై ఏళ్లకు పైగా గడిచినా ఆ ప్రయాణం ఇంకా స్ఫూర్తినిస్తుంది. ఎందుకంటే అది కేవలం భూమి నుంచి అంతరిక్షానికి జరిగిన ప్రయాణం కాదు. అనుమానాల నుంచి ఆత్మవిశ్వాసానికి, పరిమితుల నుంచి అవకాశాలకు, వివక్ష నుంచి సమానత్వానికి జరిగిన ప్రయాణం. అందుకే జూన్ 18ను స్మరించుకోవడం అంటే ఒక వ్యక్తిని గుర్తుచేసుకోవడం మాత్రమే కాదు; ప్రతిభకు సరిహద్దులు లేని ప్రపంచాన్ని



**చిటికెన కిరణ్ కుమార్**
**సెల్: 9490841284**

# పేదలు, మధ్యతరగతి జీవితాలలో గుణాత్మక మార్పు తెచ్చిన మోడీ పాలన

దేశాన్ని దశాబ్దాలుగా పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రతి ఎన్నికల ముందు చెప్పే వారికి ఇష్టమైన అచ్చొచ్చిన నినాదం "గరీబి హటావో" అంటే పేదరికాన్ని నిర్మూలిద్దాం. అవినీతి కుంభకోణాలతో కూరుకుపోయిన కాంగ్రెస్ పార్టీ వారి నాయకుల పేదరికం తిరింది గాని నిజమైన పేదలకి చేసింది ఏమీ లేదు. రాజీవ్ గాంధీ గారు ప్రధానిగా ఉన్నప్పుడు వారు స్పష్టంగా చెప్పింది ఏంటంటే నేను ఢిల్లీ నుంచి ₹100 పంపిస్తుంటే కనీసం ₹10 కూడా క్షేత్రస్థాయికి వెళ్ళటం లేదు మిగతాదంతా అవినీతి పాలైపోతుంది అన్నారు. కానీ అవినీతిని కట్టడి చేయటానికి చేసింది ఏమీ లేదు. ప్రభుత్వాలు మారిన పేదలు మధ్యతరగతి కుటుంబాల జీవితాలలో మార్పులు రావని నిరాశ నిస్పృహలో ప్రజలు ఉన్నప్పుడు వారి ప్రధాన సేవకుడిగా ప్రధాని నరేంద్ర మోడీ 2014లో దేశ పగ్గాలు చేపట్టారు.

**స్వచ్ఛభారత్:**

గతంలో ఏ ప్రధాని ఆలోచించని విధంగా ప్రధాని మోడీ గారు దేశం మహిళల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టారు. దీన్ని చాలామంది ప్రతిపక్ష నేతలు మేతావులు తప్పు పట్టారు. అయినప్పటికీ దేశం మహిళల ఆత్మగౌరవ పరిరక్షణకు కంకణబద్ధుడైన ప్రధాని మోడీ గారు దేశంలో 11 కోట్ల పైచిలుకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేశారు.

**బ్యాంకింగ్ రంగం:**

బ్యాంకులు జాతీయకరణ చేసి అప్పటికి దశాబ్దాలు గడుస్తున్న బ్యాంకింగ్ వ్యవస్థ కేవలం ధనిక వర్గాలకి పరిమితమై ఉన్నది. పేదలు మధ్య తరగతి కుటుంబాలు బ్యాంకులో ఒక ఖాతా తెరవాలంటే అనేకమైన నిబంధనలు సంతకాలు. దాంతో బ్యాంకింగ్ వ్యవస్థకి ఈ వర్గం దూరమయ్యారు. దీని కారణంగా పేదలు మధ్యతరగతి కుటుంబాలకి బ్యాంకులు నుంచి రుణాలు అందక ప్రైవేట్ వ్యక్తుల నుండి అధిక వడ్డీలకి రుణం తీసుకొని జీవితాలు గొల్లైపోతున్న పరిస్థితి. దీన్ని గమనించిన ప్రధాని మోడీ గారు "జన్ ధన్" బ్యాంకు ఖాతాలకి శ్రీకారం చుట్టి ఎటువంటి నిబంధనలు లేకుండా జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరిచే విధంగా తద్వారా వారికి ఉచితంగా జీవిత బీమా వర్తించే విధంగా పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం ద్వారా అప్పటివరకు బ్యాంకింగ్ రంగాలకి దూరంగా ఉన్న 57 కోట్ల పేదలు మధ్యతరగతి కుటుంబాలకు బ్యాంక్ ఖాతా రాగలిగింది తద్వారా వారి జీవితాలలో ఆర్థిక భద్రత పెరిగింది.

**నగదు బదిలీ:**

గత కాంగ్రెస్ ప్రభుత్వాలలో డబ్బులు దళారుల పాలై పేదలకి చేరే పరిస్థితి లేదు. అటువంటి పరిస్థితిని పరిష్కరిస్తూ ప్రధాని మోడీ గారు JAM విధానాన్ని రూపొందించి జన్ ధన్ ఖాతా, ఆధార్, మొబైల్ ఈ మూడిటిని అనుసంధానం చేశారు. పేదలు మధ్యతరగతి కుటుంబాల బ్యాంక్ ఖాతాలలో ప్రధాని మోడీ గారు ఈ 12 ఏళ్లలో 50 లక్షల కోట్ల పైచిలుకు నగదును నేరుగా వారి ఖాతాలలో జమ చేశారు.

**ముద్ర రుణాలు:**

పేదలు మధ్యతరగతి కుటుంబాలు గతంలో బ్యాంకుల నుండి రుణం పొందటం అంటే అది ఒక కల. ఏదైనా ఆస్తి తనకా పెడితే కానీ రుణం ఇవ్వని పరిస్థితి. పేదలు మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక స్వావలంబన కోసం పరిపుష్టత కోసం ఎటువంటి పూచీకత్తు లేకుండా వారు చేసే చిన్న చిన్న వ్యాపారాలకి రుణాలు విరివిగా అందించే ముద్ర రుణాల పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా పదివేల నుండి ₹20 లక్షల వరకు రుణం ఎటువంటి పూచీకత్తు లేకుండా అందిస్తున్నారు. ఇప్పటివరకు దేశంలో 57 కోట్ల పైచిలుకు మందికి ₹40 లక్షల కోట్ల పైచిలుకు నగదు అందజేసి వారి కుటుంబాలలో వెలుగులు నింపడం జరిగింది. దీనిలో 65 శాతం పైచిలుకు మహిళలు ఉండటం గర్వించదగ్గ విషయం.

**స్వనిధి యోజన:**

వీధి వ్యాపారులు చిన్నచిన్న తోపుడు బండ్లు వ్యాపారం చేసే వాళ్ళకి ఋణ సదుపాయం లేక వడ్డీ వ్యాపారుల చేతుల్లో నలిగిపోయి పరిస్థితి. ఈ పరిస్థితిని మార్చటానికి ప్రధాని మోడీ గారు స్వనిధి యోజన పథకాన్ని రూపొందించి వీధి వ్యాపారులకి 20 వేల రూపాయల వరకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రుణాలు అందించారు. ఇప్పటివరకు దేశంలో కోటి 16 లక్షల పైచిలుకు వీధి వ్యాపారులకు 18 వేల కోట్ల రూపాయలు రుణంగా అందించారు.

**ఇళ్ల నిర్మాణం:**

పేదలు మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలని సాకారం చేయటానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం శ్రీకారం చుట్టి ఇప్పటివరకు దేశంలో నాలుగు కోట్ల పైచిలుకు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు.

**వంట గ్యాస్ కనెక్షన్:**

కట్టెల పొయ్యి మీద వండుతూ పొగ చూరిపోయి అనారోగ్యాలు పాలవుతున్న మాతృమూర్తులను రక్షించడానికి ప్రధాని మోడీ గారు ఉజ్వల పథకాన్ని శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా పేదలు మధ్యతరగతి కుటుంబాలకి ఉచితంగా గ్యాస్ సిలిండర్, పొయ్యి, రెగ్యులేటర్ ఇవ్వటం జరుగుతుంది. ఈ పథకంలో భాగంగా ఇప్పటివరకు 10 కోట్ల 55 లక్షల పైచిలుకు మాతృమూర్తులకు ఉచితంగా అందించడం జరిగింది.

**ఆదాయ పన్ను:**

2014 వరకు రెండున్నర లక్షల వార్షిక ఆదాయం వరకు మాత్రమే ఆదాయ పన్ను రాయితీ ఉండేది. అంతకుముందు అనేక దశాబ్దాలుగా ఈ ఆదాయ పన్ను స్లాబ్ పెంచమని మధ్యతరగతి కుటుంబాలు ప్రభుత్వాలకు అనేక విజ్ఞప్తులు ఇచ్చి ఉన్నారు. ప్రధాని మోడీ గారు తన 12 ఏళ్ల పరిపాలనలో ఈ స్లాబ్ ని ఏకంగా 12 లక్షల కి తీసుకువెళ్లారు. ఇప్పుడు 12 లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారు ఏ ఆదాయ పన్ను కట్టక్కర్లేదు. ఇది మధ్యతరగతి కుటుంబాలకి ఎంతో మేలు చేసింది.

**LED బల్బులు:**

ఎల్ఈడి బల్బుల వినియోగం వలన విద్యుత్ వాడకం తగ్గి నెలల వచ్చే విద్యుత్ బిల్లు తగ్గుతుంది. ఇది పేద మధ్య తరగతి కుటుంబాల సొమ్ముని ఆదా చేస్తుంది. 2014 ముందు ఎల్ఈడి బల్బుల ధరలు ఆకాశాన్ని అంటేవి. ప్రధాని మోడీ గారు ప్రతి ఇంటికి 10 రూపాయలకే ఎల్ఈడి బల్బుల సరఫరా సుమారు 40 కోట్ల బల్బులు అందించి వారి జీవితాలలో వెలుగులు నింపారు.

**విద్యుత్ లేని గ్రామాలు:**

2014 నాటికి దేశంలో 20 వేల పైచిలుకు గ్రామాలకి అసలు విద్యుత్ లేదు సుమారు మూడు కోట్ల ఇళ్ళకి కూడా విద్యుత్తు లేదు. అలాంటి పరిస్థితుల్లో ప్రధాని మోడీ గారు సౌభాగ్య యోజన పథకాన్ని రూపొందించి ప్రతి ఇంటికి విద్యుత్ అందించారు అది నిరంతర విద్యుత్ అంటే అంతరాయం లేని విద్యుత్ని దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరికి అందిస్తున్నారు.

**ఇంటింటా కులాయి:**

ఇంట్లో మంచినీరు కొళాయి లేక మాతృమూర్తులు అనేక కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి కొండలతో బిందెలతో నీళ్లు తెచ్చుకునే పరిస్థితులు ఉండేవి. 2019 నాటికి దేశం గ్రామాలలో 20 కోట్ల ఇల్లు ఉంటే వాటిలో కేవలం మూడు కోట్ల ఇళ్ళకి మాత్రమే కులాయి కనెక్షన్ ఉంది. ప్రధాని మోడీ గారు పేదలు మధ్యతరగతి ప్రజలకి త్రాగునీరు ఇంటి వద్దనే అందించాలన్న ఉద్దేశంతో జల్ జీవన్ మిషన్ అను పథకాన్ని రూపొందించి ఇప్పటికీ 15 కోట్ల పైచిలుకు ఇళ్లకి కులాయి కనెక్షన్లు అందించారు.

**ఆరోగ్య భీమా:**

పేద మధ్యతరగతి కుటుంబాలలో ఏ వ్యక్తికైనా అనారోగ్యం వస్తే వైద్యం కోసం ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయే తప్పని పరిస్థితి. ఈ పరిస్థితి మార్చాలని ప్రధానమంత్రి మోడీ గారు ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య బీమా పథకం ఆయుష్మాన్ భారత్ కి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా దేశంలో 60 కోట్ల పైచిలుకు పేదలు, మధ్యతరగతి కుటుంబాలకి ఉచితంగా ఐదు లక్షల వరకు వైద్యాన్ని అందిస్తున్నారు. ఈ పథకం ఆయా కుటుంబాలలో ఆర్థిక భరోసాని కలిగించింది.

**ప్రమాద బీమా:**

పేద మధ్య తరగతి కుటుంబాలలో ఆ కుటుంబ పెద్ద ప్రమాదవశాస్తూ హఠాత్తుగా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఛిద్రం అయిపోయింది దుస్థితి. ఈ పరిస్థితి మార్చటానికి ప్రధాని మోడీ గారు జీవనజ్యోతి బీమా యోజన పథకానికి శ్రీకారం చుట్టి కేవలం సంవత్సరానికి ₹12 కడితే చాలు రెండు లక్షల పైచిలుకు ప్రమాద బీమా వర్తించేలా ఆ కుటుంబాలలో భరోసాని నింపారు.

**ఉచిత రేషన్:**

దేశంలో పేదలు మధ్యతరగతి కుటుంబాలలో ఆకలి చావులు ఉండకూడదని దేశవ్యాప్తంగా 80 కోట్ల పైచిలుకు మందికి ప్రతినెల ఉచితంగా ప్రతి వ్యక్తికి ఐదు కిలోల బియ్యాన్ని అందిస్తున్నారు.

**నైపుణ్య శిక్షణ:**

ప్రతి వ్యక్తి తన కాళ్ళ మీద తను నిలబడే విధంగా వివిధ వృత్తుల్లో రంగాలలో నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన వంటి పథకాల ద్వారా వారందరికీ ఉచిత శిక్షణ ఇస్తూ ఎటువంటి పూచీకత్తులు లేకుండా రుణాలు అందిస్తూ వారి ఆర్థిక పురోగతికి స్వావలంబనకి తోడ్పడుతున్నారు.

ప్రధాని మోడీ గారు గడచిన 12 ఏళ్లగా పేదలు మధ్యతరగతి కుటుంబాలకి అందిస్తున్న ఆర్థిక భరోసా కారణంగా దేశంలో 25 కోట్ల పైచిలుకు మంది కటిక పేదరికం నుంచి బయటపడి మధ్యతరగతి జీవితాలు గడుపుతున్నారు. ఈ ఘనత గతంలో ఏ ప్రభుత్వానికి దక్కలేదు. ఈ రకమైన పేదల పాలన గతంలో ఎన్నడూ ఎవరు చూపలేదు చేయలేదు. అందుకే ప్రధాని మోదీ ఈ 12 ఏళ్ల పరిపాలన పేదలు మధ్యతరగతి కుటుంబాలకి అంకితం.



**పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి**
**రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్ర ప్రదేశ్**

# గుడిసెలు లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- **ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ధి**
- **రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 17:**

రాష్ట్రంలో ఒక్క నిరుపేద కుటుంబం కూడా గుడిసెల్లో జీవించకుండా, ప్రతి కుటుంబం సురక్షితమైన సొంత ఇంటిలో గౌరవప్రదంగా జీవించేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు.బుధవారం హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత అమలు, గుడిసెల గుర్తింపు, రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం, అసంపూర్తి గృహాల వివరాల సేకరణ తదితర అంశాలపై మంత్రి గారు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసిన తర్వాతే ఇతర దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

**గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే**

రాష్ట్రంలోని ప్రతి గ్రామం, వార్డు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గుడిసెలను యుద్ధప్రాతిపదికన గుర్తించేందుకు సమగ్ర సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వద్ద ఇప్పటికే ఉన్న సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధృవీకరించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.ప్రజాపాలన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారని, ఆ దరఖాస్తులన్నింటినీ ప్రత్యక్షంగా పరిశీలించి నిజమైన అర్హులను గుర్తించాలని ఆదేశించారు. ఎంపీడీవో స్థాయిలో జాబితాలను సిద్ధం చేసి సంబంధిత ఇన్‌చార్జి మంత్రుల ఆమోదానికి పంపించాలని సూచించారు.సర్వే ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హుల



ఎంపికలో కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా ఎటువంటి పొరపాట్లు, వివక్షకు తావు లేకుండా అనర్హుల చొరబాటుకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి గారు స్పష్టం చేశారు.

**దరఖాస్తు చేసుకోని గుడిసెల వాసులకు అవకాశం**

గుడిసెల్లో నివసిస్తూ గతంలో ప్రజాపాలన లేదా ఇతర కార్యక్రమాల్లో దరఖాస్తు చేసుకోని నిరుపేద కుటుంబాలు ఇప్పుడు కూడా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి గారు తెలిపారు. అటువంటి దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.

**రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు**

రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు వేగవంతం చేయాలని మంత్రి గారు సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున మంజూరు చేసిన నేపథ్యంలో అర్హుల ఎంపికను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి ప్రత్యేక ప్రాధాన్యత**

పేదల నివాస భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి గారు తెలిపారు. రెండో విడతలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఇళ్లను ఈ పథకం కింద ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.గోడలు, పునాదులు బలంగా ఉన్నప్పటికీ పైకప్పులు టార్పాలిన్ షీట్లు, రేకులు, నాపరాళ్లు లేదా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పైకప్పుల కింద నివసిస్తూ ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను గుర్తించి వారికి ఆర్‌సీసీ స్లాబ్ నిర్మాణం కోసం రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు.

**అసంపూర్తి ఇళ్లకు కూడా అవకాశం**

గతంలో వివిధ గృహ నిర్మాణ పథకాల కింద మంజూరై ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. పాత ఇందిరమ్మ పథకం కింద మంజూరై బేస్మెంట్ స్థాయి లేదా పైకప్పు స్థాయిలో నిలిచిపోయిన ఇళ్లను కూడా ఈ పథకంలో చేర్చవచ్చని పేర్కొన్నారు.అలాగే గృహలక్ష్మి పథకం కింద నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయిన గృహాలను కూడా గుర్తించి రూఫ్ అప్‌గ్రేడేషన్ కార్యక్రమం ద్వారా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

**లబ్ధిదారుడే ఇంటి నిర్మాణదారు**

బీఎల్‌సీ (బెనిఫిషియరీ లెడ్ కన్స్ట్రక్షన్) విధానంలో లబ్ధిదారుడే తన ఇంటిని నిర్మించుకొనే అవకాశం కల్పించామని మంత్రిగారు తెలిపారు. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో స్థలాల కొరతను దృష్టిలో పెట్టుకొని చిన్న స్థలాలు కలిగిన లబ్ధిదారులకు అవసరాన్ని బట్టి గ్రౌండ్ ప్లస్ వన్ (జి+1) నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వవచ్చని పేర్కొన్నారు.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలో దశాబ్దాల పేదల సొంతింటి కలలను సాకారం చేస్తున్నామని మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైందని, ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ద్వారా లక్షలాది పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపబోతున్నాం అని మంత్రి గారు అన్నారు.

# ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాలను ప్రారంభోత్సవం

- రాష్ట్రంలో ఆరుట్ల గ్రామానికి చరిత్ర ఉంది
- నైజాం సర్కారుతో పోరాడిన వీరయోధులు పుట్టిన గడ్డ ఆరుట్ల గడ్డ
- ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి
- ఆరుట్ల స్కూల్ గదుల నుంచే తెలంగాణ పునఃనిర్మాణం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**మంచాల వెలుతురు జూన్ 17:**



ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు



ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు కమిటీ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు



విద్యార్థులతో అల్పాహారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు



తెలంగాణ పబ్లిక్ పాఠశాల స్కూల్ బస్సులో ప్రయాణిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు



తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని తలపాక పెట్టి శాలువాతో ఘనంగా సన్మానించి. ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మంచాల సహకార బ్యాంక్ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రారంభోత్సవం కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి స్థానిక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి గారికి ఘనస్వాగతం పలికారు అనంతరం తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రారంభోత్సవం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పాఠశాల గదులను క్రీడాప్రాంగణాలను డైనింగ్ ఆన్ ల్యాబ్ కంప్యూ టర్ గదులను పరిశీలించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు విద్యార్థులతో ఫుట్ బాల్ ఆడారు సభ ప్రాంగణానికి చేరుకొని ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ భవిష్యత్తు తరగతి గదిలోనుండే ప్రారంభమవుతుంది అని అన్నారు తెలంగాణ రాష్ట్రంలోనే ఆరుట్ల గ్రామానికి ఒక చరిత్ర ఉన్నది ఆరుట్ల రామచంద్రారెడ్డి ఆరుట్ల కమలా దేవి లాంటి వీర యోధులు నైజాం సర్కార్ తో పోరాటం చేసిన పురిటిగడ్డ ఆరుట్ల గ్రామం అని గుర్తు చేశారు ఈసభలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో జరిగిన దోపిడి పాలన చేసిన విధ్వంసాన్ని ప్రజలు ఏనాటికి మర్చిపోలేరని ఎన్ని ఏడ్పులు ఏడ్చినా ఆపార్టీకి భవిష్యత్తులేదని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరుట్లలో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా జరిగింది ఈసందర్భంగా విద్యార్థులు థ్యాంక్యూ సీఎం రేవంత్ సర్ అనే ప్లకార్డులు నినాదాలతో ముఖ్యమంత్రికి స్వాగతం పలకటం ఆకట్టుకుంది తమ స్కూల్ కు వచ్చిన విశిష్ఠ అతిధితో పిల్లలు అక్కడి సిబ్బంది కరచాలనం చేస్తూ ఫోటోలు దిగుతూ సంబరపడ్డారు పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభకు పెద్దఎత్తున విద్యార్థులు తల్లిదండ్రులు. పరిసర గ్రామాల ప్రజలు తరలి వచ్చారు సీఎం రేవంత్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వేదిక పైకి వచ్చేక్రమంలో అలాగే నేతల ప్రసంగం సమయంలో ప్రజల కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది కలల ప్రాజెక్టును ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో తొలుత పూర్తిచేయించి ప్రారంభోత్సవం చేస్తున్నందుకుగాడినూ ఈప్రాంత ప్రజలంతా సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు చెప్పాల్సిన అవసరముం దన్నారు విద్యారంగంలో దేశానికి దిక్సూచిగా ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిలుస్తుందని చెప్పారు పదేళ్ల బీఆర్ఎస్ పాలన లో చేసిన అప్పులతో రాష్ట్రం అనేక సమస్యల్లో కూరుకు పోయిందని మల్ రెడ్డి వివరించారు కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారు మాటలతో బెదిరించాలని చూస్తే భయపడేవారు లేరని హెచ్చరించారు ఓవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమాన్ని కొనసాగిస్తూ తమ ప్రభుత్వం తెలంగాణ వి కాసం దిశగా కృషి చేస్తోందని చెప్పారు ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి ఆగబోదని త నను నమ్మిన నియోజకవర్గ ప్రజల కోసమే పని చేస్తానని చెప్పారు సభ పూర్తి కాగానే ఆరుట్ల గ్రా మంలో ఉన్న సమస్యలపై గ్రామ సర్పంచ్ మాలిపాటి శోభ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి వినతి పత్రం అందజేశారు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రమంత్రి రంగారెడ్డి జిల్లాఇంచార్జ్ శ్రీధర్ బాబు రాజ్యసభ సభ్యుడు వేము నరేందర్ రెడ్డి కేశవరావు ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవ లప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి తెలంగాణ రాష్ట్రవిద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఎంపీ రఘువీర్ రెడ్డి ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి ఇబ్రహీంపట్నం ఆర్డిఓ శ్రీనివాస్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక మధుసూదన్ రెడ్డి తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్ధగోని గిరిధర్ గౌడ్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి మంచాల సహకార బ్యాంక్ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి కొత్తకురుమ శివకుమార్ మాజీ ఎంపీపీ గుండెమోని జయమ్మ మల్లేష్ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాలను ప్రారంభోత్సవం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు ఎడ్మనరేందర్ రెడ్డి ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నా యకులు గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు వివిధ శాఖల అధికారులు తదితరులుపాల్గొన్నారు

# హైదరాబాద్ జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అంబర్‌పేట్ క్లస్టర్ సమీక్ష సమావేశం

- పేద ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి
- సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- గర్భిణీ స్త్రీలకు అన్ని రకాల ఆరోగ్య సేవలు అందించాలి
- పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి , వ్యాధుల నుండి రక్షణ కల్పించడం ప్రతి ఒక్క సిబ్బంది బాధ్యత

**హైదరాబాద్ వెలుతురు జూన్ 17:**



హైదరాబాద్ జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో అంబర్‌పేట్ క్లస్టర్ పరిధిలోని బాగ్ అంబర్‌పేట్ UPHC, ముషీరాబాద్ UPHC, బోలక్‌పూర్ UPHC, AMS UPHC, హరాజ్‌పెంట UPHC మరియు తిలక్‌నగర్ UPHCలకు చెందిన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ANMలు మరియు ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది.ఈ సందర్భంగా DM&HO గారు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ మరియు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే, ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శ్రీధర్ , అదనపు DM&HO డా. అనిత , క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా. శ్రీకళ, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా:ఆశ్రిత రెడ్డి , జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు పాల్గొని వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హాజరైన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ANMలు మరియు ఆశా కార్యకర్తలకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు.

# జిల్లా నూతన విద్యాధికారి వెంకటేశ్వర్లు గారిని కలిసిన తెలంగాణ పిడి & పిఈటి సంఘం నాయకులు

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 17:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం రంగారెడ్డి జిల్లా నూతన విద్యాధికారిగా బాధ్యతలు తీసుకున్న గౌర వ డీఈవో వెంకటేశ్వర్లు గారిని తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మహ్మద్ సాబేర్ గారి ఆధ్వర్యం లో కలిసిన రంగారెడ్డి జిల్లావ్యాయామ విద్య ఉపాధ్యాయులు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు గారిని కలిసి పాఠశాలల్లో క్రీడల అభివృద్ధికి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు అందించా లని ఈవిద్య సంవత్సరం జరిగే పాఠశాల క్రీడలకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని వ్యా యామ విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరడం జరిగింది అలాగే డీఈవో వెంకటేశ్వర్లు గారి కి సంఘం డైరీ అందించి సన్మానం చేశారు ఈసందర్భంగా డీఈవో గారు మాట్లాడుతూ అన్ని స మస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తెలిపారుఈ కార్యక్రమంలో రాష్ట్రప్రధాన



కార్యద ర్శి మహ్మద్ సాబేర్ గారు జిల్లాస్కూల్ గేమ్స్ సెక్రటరీ రామచంద్రుడు గారు నాయకులు అబ్దుల్లా భాస్కర్ యాదమ్మ ఆనంద్ బాబు మహిపాల్ జావిద్ రాథోడ్ దశరథ్ కృష్ణ అమృత తిరుపతి రమేష్ కృష్ణరెడ్డి శేఖర్ శ్రీనివాస్ అంజి తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ నా ప్రాణమిత్రుడు: ట్రంప్

- అమెరికా-భారత్ ప్రతిష్టాత్మక వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారు
- తుది దశకు చేరుకున్న చర్చలు
- జీ7 సదస్సు వేదికగా 16 నెలల తర్వాత ఇరు దేశాధినేతల ముఖాముఖి భేటీ


**ఇంటర్నెట్ డెస్క్, (వెలుతురు ప్రతినిధి) జూన్ 17:**

భారతదేశం, అమెరికా దేశాల మధ్య సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న అత్యంత ప్రతిష్టాత్మకమైన వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఫ్రాన్స్‌లోని ఎవియాన్ నగరంలో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో ట్రంప్ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ తనకెంతో కాలంగా అత్యంత ఆప్తమిత్రుడని కొనియాడిన ట్రంప్, ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుందని, రాబోయే కొద్ది వారాల్లోనే ఈ ప్రక్రియ మొత్తం పూర్తవుతుందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ వైట్ హౌస్ పర్యటన తర్వాత దాదాపు 16 నెలల సుదీర్ఘ విరామం అనంతరం ఇరు నేతలు ముఖాముఖి సమావేశం కావడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ద్వైపాక్షిక చర్చల అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో సమాధానాలు ఇస్తూ ప్రధాని మోదీపై ప్రశంసల జల్లు కురిపించారు. "నరేంద్ర మోదీ అత్యంత కఠినమైన సంప్రదింపుదారుడు. అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాల్లో ఆయనతో డీల్స్ చేయడం చాలా కష్టం. ఈయనను ఒకసారి చూడండి.. ఎంతో అందంగా, ఒక దేవదూతలా కనిపిస్తారు. కానీ వ్యవహారాల్లో మాత్రం ఉక్కుమనిషి. తన శాంత స్వభావంతో అందరినీ ఆశ్చర్యపరుస్తారు. ఆయనకు భారత ప్రజలంటే ఎంత ప్రేమో, అమెరికాతో బంధమన్నా అంతే ఇష్టం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికాలో భారత పెట్టుబడులను ప్రోత్సహించడంలో, అక్కడ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంలో ప్రధాని మోదీ తీసుకుంటున్న చొరవను తాము ఎంతగానో అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు .గతంలో హ్యూస్టన్‌లో నిర్వహించిన చారిత్రాత్మక "హౌడీ మోదీ" బహిరంగ సభను ఈ సందర్భంగా డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య, తమ ఇద్దరి మధ్య వ్యక్తిగత సద్భావన మరియు వ్యూహాత్మక సంబంధాలు అత్యంత బలంగా కొనసాగుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. గత ఏడాది ఫిబ్రవరిలో కుదిరిన తాత్కాలిక వాణిజ్య ఒప్పందం ఆధారంగా.. ప్రస్తుతం పూర్తి స్థాయి ఒప్పందానికి సంబంధించిన అన్ని ముసాయిదాలు సిద్ధమయ్యాయని, ఇరు దేశాల ఉన్నతాధికారులు దీనిపై నిరంతరం సమీక్షిస్తున్నారని వెల్లడించారు.ప్రస్తుతం అంతర్జాతీయంగా ఇంధన మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న తరుణంలో ఈ ఇరు దేశాధినేతల భేటీ ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా గ్లోబల్ ఆయిల్, గ్యాస్ సరఫరాకు అత్యంత కీలకమైన రవాణా మార్గమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' జలసంధిలో నెలకొన్న అస్థిరత, సముద్ర మార్గాల భద్రతపై ఇరు దేశాలు సుదీర్ఘంగా చర్చించాయి. ప్రపంచ వాణిజ్యానికి, ఇంధన భద్రతకు ముప్పు వాటిల్లకుండా భారత్-అమెరికా దేశాలు కలిసి కట్టుగా వ్యూహాత్మక అడుగులు వేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

# కుత్బుల్లాపూర్‌లో మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి: కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 17:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న మంచినీటి సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను ఎండీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించినట్లు హన్మంత్ రెడ్డి తెలిపారు. అనంతరం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, గత 15 సంవత్సరాలలో జరగని అభివృద్ధి ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత



ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.కుత్బుల్లాపూర్ ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులు పడకుండా చూడటం తమ బాధ్యత అని పేర్కొన్న హన్మంత్ రెడ్డి, రాబోయే ఏడాది కాలంలో నియోజకవర్గంలో ఎలాంటి మంచినీటి సమస్య లేకుండా చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కాలనీకి తగినంత తాగునీటి సరఫరా అందేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు.

# పైప్‌లైన్ లీకేజీ సమస్యపై సర్పంచ్ భరత్ తక్షణ స్పందన

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 17:**



ఈ నెల 16వ తేదీ మంగళవారం గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ పగిలి పోవడంతో మంచినీరు డ్రైనేజీలో కలుషితమవుతున్న విషయాన్ని గ్రామ సర్పంచ్ జేరిపోతుల భరత్ దృష్టికి తీసుకువెళ్లారు.సమస్య తీవ్రతను గుర్తించిన సర్పంచ్ భరత్ వెంటనే స్పందించి, మరుసటి రోజే సంబంధిత సిబ్బందితో మరమ్మతు పనులను ప్రారంభించారు. పైప్‌లైన్ లీకేజీని సరిచే సేందుకు చర్యలు చేపట్టడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టిన సర్పంచ్ భరత్‌ను గ్రామస్తులు అభినందిస్తూ, ఇలాంటి సేవా దృక్పథంతో గ్రామాభి వృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# ఘనంగా ధైద రవీందర్ పుట్టినరోజు వేడుకలు

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 17:**



కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ టీపీసీసీ కార్యదర్శి ధైద రవీందర్ పుట్టినరోజు సందర్భంగా నిరుపేదల ఆకలి నిలయం "మనం" స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ 592వ రోజు సేవా కార్యక్రమంలో భాగంగా బిక్షాటన చేసే వారు, నిరుపేదలు, బాటసారులు, నిస్సహాయులకు కలిపి సుమారు 100 మందికి అన్నదానం చేశారు.ఈ సందర్భంగా ధైద రవీందర్ మాట్లాడుతూ, ప్రజల మధ్య నిత్యం ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న "మనం" సంస్థ చేస్తున్న సేవలు అభి నందనీయమన్నారు. ప్రతిరోజూ 100 మందికి ఉచిత భోజనం అందించడం గొప్ప విషయమని కొనియాడారు. సంస్థ నిర్వాహకుడు ధైద నాగరాజు ఎంతో నిష్ఠ, నిబద్ధతతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.అలాగే భవిష్యత్తులో కూడా ఈ సంస్థకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విక్రమాచారి, గుంటూరి ఈశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సిద్ధి వినాయక పేపర్ ప్లేట్స్ షాప్ ప్రారంభం

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 17:**



నార్కెట్‌పల్లి పట్టణానికి చెందిన ఎనమల్ల యశ్వంత్ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సిద్ధి వినాయక పేపర్ ప్లేట్స్ షాప్ ను నార్కెట్‌పల్లి సర్పంచ్ భరత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ భరత్ కుమార్ మాట్లాడుతూ, యువ పారిశ్రామికవేత్తలు స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకుంటూ వ్యాపార రంగంలో ముందుకు రావడం అభినందనీ యమని అన్నారు. వ్యాపార సంస్థ అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకుడు యశ్వంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నార్కెట్‌పల్లి మాజీ సర్పంచ్ అచ్చాలు, మాజీ ఎంపీటీసీ పాశం శ్రీనివాస్ రెడ్డి, రాదరపు బిక్షం, చింతపల్లి బయన్న, వార్డు సభ్యులు బకరం జనార్ధన్, పాలకూరి రమేష్, మాదాసు నరేష్ మంద ఎల్లయ్య, బాజా హేమంత్, గుడాల మస్తాన్,నార్కెట్‌పల్లి నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ

**మునుగోడు,జూన్ 17(వెలుతురు):**



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం అందజేసిన పుస్తకాలను గ్రామ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహగౌడ్ విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. సకాలంలో పాఠ్యపుస్తకాలు అందడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తల్లమల్ల మల్లేశం, ప్రధానోపాధ్యాయులు బాలప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యూ ఒరిస్సా ఫ్యామిలీ దాబా ప్రారంభం

**మునుగోడు,జూన్ 17(వెలుతురు):**



మునుగోడు మండల కేంద్రంలోని చౌటుప్పల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ ఒరిస్సా ఫ్యామిలీ దాబాను ఈ రోజు తహసీల్దార్ నేలపట్ల నరేష్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన దాబా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మాట్లాడుతూ వినియోగదా రులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని పరి శుభ్రమైన వాతావరణంలో అందించాలని సూచించారు.యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తూ వ్యాపార రంగంలో రాణించాలని ఆకాంక్షించారు.దాబా నిర్వాహకులు మాట్లాడుతూ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మందుల సత్యం,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు,యు ఆర్ డి ఎస్ చైర్మన్ బొడ్డు నాగరాజు గౌడ్,గోలి లింగస్వామి, మాదనబోయిన పరమేష్ యాదవ్,నల్గొండ అంజి, యడవెల్లి సురేష్,స్థానిక ప్రముఖులు, వ్యాపార వేత్తలు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

# బోయపల్లి సూర్య గౌడ్ - శ్రావణి ఎంగేజ్మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న సురిగి నరసింహ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 17:**

ఉకొండి గ్రామానికి చెందిన బోయపల్లి సూర్య గౌడ్, లింగోజిగూడకు చెందిన బొడిగ శ్రావణి ఎంగేజ్మెంట్ సరూర్‌నగర్ కుమ్మరి సంఘం కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా జరిగింది. ఇరు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సాగింది.ఈ కార్యక్రమానికి మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్, మిద్ద యాదయ్య గౌడ్, కందుల రవికుమార్ గౌడ్, రమేష్ గౌడ్, బోయపల్లి రజనీకాంత్, జనగాం రాముగౌడ్ తదితరులు హాజరయ్యారు.



# తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్రానికి...

(మొదటి పేజీ తరువాయి)





ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం నామోషీగా భావించే పరిస్థితులు మారాలని సీఎం అన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ముఖ్యమంత్రులు వంటి ఉన్నత స్థానాలకు ఎదిగిన వ్యక్తులు ఉన్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం వర్గాల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పాఠశా లలను ఏర్పాటు చేసి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని విమర్శించారు. కుల విభజనలకు తావులేకుండా అందరూ కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తామని సీఎం పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివ ర్శిటీని ప్రారంభిస్తామని వెల్లడించారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ దిగ్గజం Lionel Messiని హైదరాబాద్‌కు తీసుకొస్తే కూడా విమర్శలు చేశారని వ్యాఖ్యానించారు.విద్యార్థులకు అందించే విద్యా కిట్ల నాణ్యత విషయంలో ప్రభుత్వం రాజీ పడబోదని సీఎం స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన యూనిఫామ్‌లు నెలరోజులకే చిరిగిపోయేవని ఆరోపించారు. ప్రస్తుతం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యా కిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచామని, అయితే రూ.680 కోట్ల టెండర్లలో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని కొందరు ఆరోపిస్తున్నారని, అది ఎలా సాధ్యమో చెప్పాలని ప్రశ్నించారు.విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వ పాఠశాలలను అత్యుత్తమ విద్యా కేంద్రాలుగా తీర్చిది ద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రితో భేటీ అయిన మంచాల సర్పంచ్ మానస వినయ్

**మంచాల వెలుతురు జూన్ 17:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ప్రభుత్వ పబ్లిక్ స్కూల్‌ను ప్రారం భించేందుకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గారిని మంచాల గ్రామ సర్పంచ్ శ్రీమతి మానసా వినయ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మానసా వినయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామాన్ని ఎంపిక చేసి పేద, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ఒక ఆదర్శవంతమైన మోడల్ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు ఈ పాఠశాల నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.మంచాల మండల ప్రధాన కేంద్ర సర్పంచ్‌గా ముఖ్యమంత్రి గారిని కలిసిన సందర్భంగా మండల అభివృద్ధి, స్థానిక సమస్యలు మరియు భవిష్యత్ అవసరాలపై వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అత్యంత ఆత్మీయంగా పలకరించి, స్థానిక పరిస్థితులు మరియు ప్రజల అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారని పేర్కొన్నారు.చాలా సంవత్సరాల అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి మంచాల మండలానికి రావడం చారిత్రాత్మక ఘట్టమని, ఒకప్పుడు కమ్యూనిస్టు ఉద్యమాలకు కేంద్రంగా, నక్సలైట్ ప్రభావిత ప్రాంతంగా గుర్తింపు పొందిన ఈ వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం ఆనందంగా ఉందని తెలిపారు. అలాంటి ప్రాంతంలోనే అత్యాధునిక సౌకర్యాలతో కూడిన పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయడం పట్ల తాము గర్విస్తు న్నామని అన్నారు.ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని విజయ వంతంగా అమలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్లా శ్రీధర్ బాబు గారికి, స్థానిక శాసన సభ్యులు మల్ రెడ్డి రంగా రెడ్డి గారికి మానసా వినయ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల జీవితాల్లో విద్య ద్వారా మార్పు తీసు కురావాలనే ప్రభుత్వ సంకల్పానికి ఈ పాఠశాల నిదర్శనంగా నిలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు



# కరిక్యులం ఎంపిక రాష్ట్రాల హక్కు: కేరళ సీఎం

- నలుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసిన కేరళ ప్రభుత్వం
- పథకం అమలుపై మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం
- పాఠశాలల ఎంపికలో రాష్ట్రానికే స్వేచ్ఛ ఉండాలని అభిప్రాయం
- విద్యా విధానాల అమలులో రాష్ట్రాల పాత్ర కీలకమన్న సీఎం
- పీఎం శ్రీ కింద రాష్ట్రానికి రూ.99 కోట్లు వచ్చినట్లు వెల్లడి
- గత ప్రభుత్వ హయాంలోనే ఒప్పందం కుదిరిందన్న వ్యాఖ్య
- నిధులను కూడా గత ప్రభుత్వమే స్వీక రించిందని స్పష్టం
- అనివార్య పరిస్థితుల్లో పథకాన్ని కొనసా గిస్తున్నామన్న కేరళ ప్రభుత్వం

**కేరళ వెలుతురు జూన్ 17:**



పాఠశాలల్లో అమలు చేసే కరిక్యులం ఎంపిక విషయంలో రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ ఉండాలని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ పేర్కొన్నారు. విద్యా విధానాల అమలులో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం శ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని సమగ్రంగా పరిశీలించేందుకు నలుగురు మంత్రులతో కూడిన ఉపకమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.తన అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం విలేకరులకు తెలిపారు. పీఎం శ్రీ పథకం అమలు, దాని ప్రభావం, రాష్ట్ర విద్యా విధానాలతో దాని అనుసంధానంపై ఉపకమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని చెప్పారు.ఈ పథకాన్ని అమలుచేసే పాఠశాలల ఎంపిక విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వానికే స్వేచ్ఛ ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. విద్యా రంగానికి సంబంధించిన నిర్ణయాలు స్థానిక అవసరాలు, రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను పరిమితం చేసే విధంగా ఎలాంటి నిబంధనలు ఉండకూడదన్నారు.పీఎం శ్రీ పథకం కింద కేరళకు రూ.99 కోట్ల నిధులు అందాయని సతీశన్ తెలిపారు. అయితే ఈ పథకానికి సంబంధించిన ఒప్పందం గత ప్రభుత్వ హయాంలోనే కుదిరిందని చెప్పారు. ఆ ఒప్పందం ఆధారంగానే కేంద్రం నుంచి నిధులు కూడా విడుదల య్యాయని పేర్కొన్నారు.గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, ఇప్పటికే వచ్చిన నిధులను దృష్టిలో ఉంచుకుని అనివార్య పరిస్థితుల్లో ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్తు న్నామని సీఎం వివరించారు. అయితే పథకం అమలు సందర్భంగా రాష్ట్ర ప్రయోజనాలు, విద్యా విధానాల స్వతంత్రతకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసు కుంటామని స్పష్టం చేశారు.విద్యా రంగంలో రాష్ట్రాల హక్కులను పరిరక్షించడంలో కేరళ ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని సీఎం సతీశన్ పేర్కొన్నారు. పీఎం శ్రీ పథకానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

# రూ.2 వేల కోట్ల అవినీతి నిరూపిస్తే రాజీనామా చేస్తాం: మంత్రుల సవాల్

- రూ.1100 కోట్ల టెండర్‌లో రూ.2 వేల కోట్ల అవినీతి ఎలా సాధ్యం?
- ఆరోపణలకు ఆధారాలు చూపాలని డిమాండ్
- తిమ్మాపూర్ నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మంత్రులు
- ప్రజా రవాణాపై విశ్వాసం చాటిన పొన్నం, అడ్లూరి
- మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న పొన్నం



**తిమ్మాపూర్ వెలుతురు జూన్ 17:**

ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల్లో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న ఆరోపణలను నిరూపిస్తే తాము రాజీనామా చేసేందుకు సిద్ధమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. మాజీ మంత్రి టీ. హరీష్ రావు చేసిన ఆరోపణలపై స్పందించిన వారు, రూ.1100 కోట్ల టెండర్‌లో రూ.2 వేల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందో వివ రించాలని ప్రశ్నించారు.కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం తిమ్మాపూర్ నుంచి నగరానికి ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మంత్రులు ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు.మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ఆర్టీసీ బస్సులకు యజమా నులను చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. మహిళల అభివృద్ధి, ఆర్థిక సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.విపక్షాలు ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయవద్దని మంత్రులు సూచించారు. ప్రభుత్వంపై చేసే ప్రతి ఆరోపణకు వాస్తవాధారాలు ఉండాలని, నిరాధార విమర్శలను ప్రజలు నమ్మరని అన్నారు. ప్రజలకు జవాబుదారీతనంతో ప్రభుత్వం పనిచేస్తోందని, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.

# ఆధ్యాత్మిక, మహిమాన్విత, అమ్మవార్ల దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయ షోడశ (16వ) వార్షికోత్సవ వేడుకలకు వేళాయే..!!

- **ఈనెల 19న జరిగే వార్షికోత్సవ వేడుకల కోసం ముస్తాబైన శ్రీ మహాశక్తి దేవాలయం**
- **శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో వార్షికోత్సవ వేడుకలు, పూజలు.**
- **18న విద్యారణ్య భారతి స్వామి నగరానికి రాక....**
- **వేడుకలకు హాజరుకానున్న కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్.**

**కరీంనగర్ వెలుతురు జూన్ 17:**

కరీంనగర్ జిల్లాలో అత్యంత ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతు, కరీంనగర్ ప్రజల ఆరాధ్య దైవం, మహిమాన్విత శక్తి స్వరూపులైన శ్రీ మహాదుర్గా, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లతో కొలువుదీరి భక్తుల పాలిట కొంగుబంగారంగా మారిన దివ్య పుణ్యక్షేత్రం "శ్రీ మహాశక్తి దేవాలయ" షోడశ (16వ) వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమైంది. ఈనెల 19 శుక్రవారం రోజున జరగనున్న వార్షికోత్సవ వేడుకల కోసం ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో అత్యంత వైభవంగా వేడుకలను, ప్రత్యేక పూజా కార్యక్రమాలను శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి దివ్య ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరగనున్నాయి. వార్షికోత్సవ వేడుకలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ హాజరుకానున్నారు.

వార్షికోత్సవం రోజైన శుక్రవారం (జూన్ 19) నాడు ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక విశేష పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించనున్నారు.

**ఇవి కార్యక్రమాలు....**

ఉదయం 4:30 నిమిషాలకు జగద్గురువుల కరకమలములచే శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారికి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు, అనంతనాగేంద్ర స్వామి వారికి అత్యంత వైభవంగా అభిషేక పూజలు ,ఉదయం 8:00 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనము, గణపతి పూజ, అఖండ దీపారాధనము, సర్వతోభద్ర మండల పూజలతో పాటు లోక కల్యాణార్థం లక్ష్మీగణపతి హోమము, రుద్ర సహిత చండీ హోమము, పూర్ణాహుతి, మంత్రపుష్పం అనంతరం జగద్గురువుల అనుగ్రహ భాషణం (ఆశీర్వచనం), తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం ...

**త్రిశక్తుల స్వరూపం - మహిమాన్విత దివ్య క్షేత్రం "శ్రీ మహాశక్తి దేవాలయం**

ఒకే దేవాలయ ప్రాంగణంలో అత్యంత శక్తివంతమైన ముగ్గురు అమ్మవార్లు త్రిశక్తి రూపంలో భక్తులకు దర్శనమిచ్చే అరుదైన పుణ్యక్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం.

శ్రీ మహాదుర్గ:

భక్తులకు రక్షణను, ధైర్యాన్ని ప్రసాదించే శక్తి స్వరూపిణి.

శ్రీ మహాలక్ష్మి:

అష్టైశ్వర్యాలను, కుటుంబ సౌఖ్యాన్ని, వ్యాపార వృద్ధిని ఇచ్చే లక్ష్మీదేవి.

శ్రీ మహాసరస్వతి:

చదువుల తల్లి, జ్ఞానాన్ని ప్రసాదించే విద్యా స్వరూపిణి. ల ఆధ్యాత్మిక నిలయం శక్తివంతమైన పూజా విధానాలతో అలరారే ఈ ఆలయం భక్తులకు నేడు సమస్త భక్తుల పాలిట కొంగు బంగారంగా మారింది. 15 ఏళ్ల భక్తుల అచంచల విశ్వాసంతో ఈ ఆలయం కరీంనగర్ జిల్లాలోనే కాకుండా ఉత్తర తెలంగాణలోనే ఒక ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా ఎదిగింది. ఇక్కడి అమ్మవారిని దర్శించుకుని మనసారా మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని, ముఖ్యంగా వ్యాపార వృద్ధి, చదువు, కుటుంబ సౌఖ్యం కలుగుతాయని భక్తుల బలమైన నమ్మకం. అమ్మవారి ఆశీస్సులతో భక్తుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న క్షేత్రంగా శ్రీ మహాశక్తి దేవాలయం ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా దేవాలయంలో కన్నుల పండుగగా అనేక ప్రధాన ఉత్సవాలు, పండుగ వేళల్లో ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయి. ప్రధానంగా దసరా నవరాత్రి ఉత్సవాలు ఇక్కడ అత్యంత వైభవంగా జరుగుతాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరిస్తారు. ఈ సమయంలో ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ సంబరాలు, అన్నదానాలు భారీ ఎత్తున దాండియా నృత్యాలు ఘనంగా ప్రతిఏటా నిర్వహిస్తారు. అలాగే విజయదశమి సమయంలో ఇక్కడ భవానీ మాల ధరించిన దీక్షాపరుల కోలాహలం ఎక్కువగా ఉంటుంది. విజయవాడ తర్వాత అదే స్థాయిలో భవాని మాల ధారులకు శ్రీ మహాశక్తి దేవాలయం ఆధ్యాత్మిక కేంద్ర బిందువుగా మారింది అనడంలో అతిశయోక్తి లేదు. ప్రతి ఏటా వేలాదిమంది దీక్షపరులు ఇక్కడ భవాని మాల ధారణ చేస్తున్నారు. ప్రముఖ రాజకీయ, సామాజిక నాయకులు సైతం ఇక్కడ దీక్షలు చేపట్టడం విశేషం.

శ్రీ మహాశక్తి దేవాలయంలో నిర్వహించే విశిష్ట పూజలు, భక్తి ప్రపత్తులకు నిలయం

విశేష పూజలకు, పర్వదినాల

ఆధ్యాత్మికతకు, భక్తికి చిరునామాగా నిలుస్తున్న శ్రీ మహాశక్తి దేవాలయం భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతోంది. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు ప్రతిరోజూ అశేష సంఖ్యలో తరలివచ్చే ఈ క్షేత్రంలో, విశేష పర్వదినాల్లో నిర్వహించే పూజా కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

**ఉగాది**

తెలుగువారి నూతన సంవత్సర మైనటువంటి ఉగాది పర్వదినాన అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలి వస్తుంటారు. దేవాలయంలో సాయంత్రం జరిగే పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొని భక్తులు తమ యొక్క గ్రహస్థితి, రాశి ఫలాలను తెలుసుకుంటారు.

**శ్రీ సీతారాముల కళ్యాణం**

శ్రీరామనవమి నాడు దేవాలయంలో జరిపించే సీతారాముల కళ్యాణం కన్నుల పండువగా జరుగుతుంది. కళ్యాణంలో జరిగే ప్రతి ఒక్క క్రతువు ఒక్కొక్కటిగా వివరించుకుంటూ జరపడం ఇక్కడ ఆనవాయితీ. ఇది భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని ఇస్తుంది.

**వసంత పంచమి**



చిన్నారుల అక్షరాభ్యాస దివ్య క్షేత్రంగా జరిగే ముఖ్యమైన వేడుకలకు ఇక్కడ ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ కొలువుదీరిన శ్రీ మహాసరస్వతి విద్యాప్రదాయిని. బాసర సరస్వతీ క్షేత్రం తర్వాత అక్షరాభ్యాసానికి అంతటి విశిష్టత, ప్రాముఖ్యత కలిగిన ఏకైక క్షేత్రంగా శ్రీ మహాశక్తి దేవాలయం మారింది. ముఖ్యంగా వసంత పంచమి రోజున వేలాదిమంది చిన్నారులు ఇక్కడ పుస్తక పూజలు, అక్షరాభ్యాసం చేసుకుంటారు. జ్ఞానాన్ని ప్రసాదించే అమ్మవారి సన్నిధిలో తమ పిల్లల విద్యాభ్యాసాన్ని ప్రారంభించడం శుభప్రదమని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

**మహాశివరాత్రి**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సాయంత్రం దేవాలయంలో లింగార్చన , రుద్రాభిషేక పూజలు భక్తులచే స్వయంగా జరిపిస్తారు.కేవలం వేములవాడలో జరిగే లింగార్చన పూజలు ఆ తర్వాత మహాశక్తి దేవాలయంలో భక్తుల నడుమ ఘనంగా నిర్వహిస్తారు.

**సంకటహర చతుర్థి**

ప్రతి నెల వచ్చే సంకష్ట చతుర్దశి నాడు గణపతిని ప్రత్యేకంగా పూజిస్తారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరునికి హోమం, అభిషేకాలు, విశేష పూజలు శ్రీ మహాశక్తి దేవాలయంలో ఘనంగా నిర్వహిస్తారం. అన్నప్రసాద వితరణ కూడా జరుగుతుంది.సంకష్ట చతుర్దశి రోజున జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొనే సమస్త భక్తులు కోరికలు నెరవేరుతాయని, కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయని ప్రగాఢ విశ్వాసం.

**శ్రావణ మాస ప్రత్యేక పూజలు**

స్త్రీ సౌభాగ్యానికి, సకల శుభాలకు సంకేతం శ్రావణ మాసం. ఈ మాసంలో అమ్మవారికి నిర్వహించే కుంకుమార్చనలు, వరలక్ష్మీ వ్రతాలు ఎంతో విశేషమైనవి. మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొనే ఈ పూజలు అమ్మవారి అనుగ్రహాన్ని ప్రసాదిస్తాయనీ మహిళా భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తుంటారు.

**దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు**

అమ్మవారి ప్రధాన పండుగ అయిన శరన్నవరాత్రి ఉత్సవాలు ఇక్కడ అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. దేవాలయం ను 9 రోజులు పాటు వివిద పూల అలంకారం లతో , ఆకర్షణీయ మైన విద్యుత్ దీపాల తో ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుంది. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ అలంకారాలలో దర్శించుకోవడం, చండీ హోమం వంటి విశేష పూజలు చేయడం ద్వారా దుష్టశక్తులు నశించి, విజయం చేకూరుతుందని భక్తుల నమ్మకం.

**వినాయక నవరాత్రులు:**

9 రోజుల పాటు గణనాథుని ప్రత్యేక పూజలతో దేవాలయం భక్తిభావంతో అలరారుతుంది. ఈ నవరాత్రుల్లో ప్రతిరోజు ఉదయం నిర్వహించే గణపతి హోమానికి భక్తులు అ శేష సంఖ్యలో తరలివచ్చి గణనాథుని పూజించుకోవడం ఆనవాయితీ.

**దీపావళి**

దీపాల వెలుగులతో అమ్మవారిని ఆరాధించే ఈ పర్వదినం, అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని ప్రతీతి. ప్రతి దీపావళికి లక్ష్మీ కుబేర పూజ, అమ్మవార్లకు సుగంధద్రవ్యాభిషేకములు, ప్రత్యేక అలంకరణ జరుగుతుంది.

**తులసి కళ్యాణం మరియు అయ్యప్ప స్వామి పడిపూజ**

ప్రతి ఏడు కార్తీక మార్గశిర మాసాలలో దేవాలయంలో శ్రీ తులసీ దామోదర కళ్యాణం మరియు అయ్యప్ప స్వామి పడిపూజను నిర్వహించడం జరుగుతుంది. సాధారణ భక్తులే కాకుండా ఎంతోమంది అయ్యప్ప స్వామి దీక్షాపరులు ఈ పూజలో పాల్గొని తరిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలను కూడా జరుపుకుంటారు.

**మార్గశిర మాసం - ధనుర్మాసం**

సంక్రాంతి సమయంలో వచ్చే ఈ మాసాలలో దేవాలయంలో గోదా కళ్యాణం నిర్వహించడం, ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం కల్పించడం జరుగుతుంది.

**రుద్ర సహిత చండీ హోమం**

ప్రతినెల బహుళ అష్టమి రోజున దేవాలయంలో రుద్ర సహిత చండీ హోమము ఘనంగా, వేదోక్తంగా జరుగును. అమ్మవార్లకు ప్రత్యేకంగా సంబంధించినటువంటి ఈ చండీ హోమం ద్వారా భక్తులు శత్రు విజయం, సకల సమస్యల నివారణ, ఐశ్వర్య ప్రాప్తి, సర్వ పాపహరణంగా భావిస్తారు.

**నాగులపంచమి,చవితి**

ప్రతి మనిషి తన జీవితా కాలంలో వివిధ రకములైనటువంటి గ్రహ దోషాలు లేదా సమస్యలను ఎదుర్కోక తప్పదు. ముఖ్యంగా అంగారక, రాహు, కేతు గ్రహాలు అనుకూలంగా లేనప్పుడు నాగేంద్రుని పూజించడం వల్ల దోశాలు పోతాయని భక్తుల నమ్మకం.ఇక్కడ నాగులపంచమి,చవిత

పర్వదినం రోజున మహిళలు నాగేంద్రునికి అభిషేక పూజలు చేయడం వల్ల తమకు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు కలుగుతాయని విశ్వసిస్తారు.

ఇలా దేవాలయంలో ప్రతి నెల, ప్రతి ఏటా నిర్వహించే వేడుకలు పర్వదినాల్లో కోరికలను తీర్చే శ్రీ మహాశక్తిని దర్శించుకుని, విశేష పూజలలో పాల్గొని అమ్మవారి పరిపూర్ణ అనుగ్రహాన్ని భక్తులు పొందుతుంటారు. ఈనెల 19, శుక్రవారం రోజున జరిగే ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో, పూజా కార్యక్రమాలలో కూడా హిందూ బంధువులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, త్రిశక్తి స్వరూపులైన శ్రీ మహాశక్తి దేవాలయ అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# ప్రాణాలు తీస్తున్న రహదారి... వెంటనే స్పందించిన జహీరాబాద్ రూరల్ సీఐ

- **వెంటనే మరమ్మతులు చేపట్టిన నూతన న్యాల్కల్ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 17:**

సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండల పరిధిలోని కొత్తూరు – మిర్జాపూర్ మార్గమధ్యంలోని దెబ్బతిన్న రహదారి వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. గత మూడు రోజుల క్రితం ఇదే రహదారిపై జరిగిన ఘోర ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. రహదారిపై భారీ గుంతలు ఏర్పడటం, తారు పూర్తిగా ఊడిపోవడం, వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారడంతో తరచూ చిన్నా పెద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యను గుర్తించిన స్థానిక సీఐ శ్రీ జక్కుల హనుమంత్ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని వెంటనే స్పందించారు. రహదారి దుస్థితి కారణంగా మరిన్ని ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు.సీఐ జక్కుల హనుమంత్ అభ్యర్థన మేరకు నూతన న్యాల్కల్ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతుల పనులను చేపట్టించారు.ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలను పూడ్చివేయడంతో పాటు రహదారిని వాహనాల రాకపోకలకు




అనుకూలంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ, ప్రమాదకరంగా మారిన రహదారిపై వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాల రక్షణ కోసం చొరవ చూపిన సీఐ జక్కుల హనుమంతు, అలాగే రహదారి మరమ్మతులు చేయించిన మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఇదే విధంగా స్పందిస్తే మరిన్ని ప్రమాదాలను నివారించవచ్చని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# నెల రోజులు గడిచినా కదలని అధికారులు..!

- **అసంపూర్తి నాలాతో నాలుగు ఇళ్లకు ముప్పు..**

**ప్రజావాణి ఫిర్యాదు బుట్టదాఖలా?**

**జహీరాబాద్ వెలుతురు, జూన్ 17:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని గడి వీధిలో రైల్వే ఫ్లైఓవర్ సమీపంలో అసంపూర్తిగా నిలిచిపోయిన డ్రైనేజీ (నాలా) నిర్మాణ పనులు స్థానికులకు శాపంగా మారాయి. నాలా పనులను పూర్తి చేయాలని కోరుతూ బాధిత కుటుంబం నెల రోజుల క్రితమే ప్రజావాణి ద్వారా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని స్థానికులు మండిపడుతున్నారు.గడి వీధికి చెందిన దత్తాత్రి తండ్రి అనంతరావు గత నెల మే 18న తహశీల్దార్‌కు ప్రజావాణి ద్వారా వినతిపత్రం సమర్పించారు. రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో ప్రారంభించిన డ్రైనేజీ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో వర్షపు నీరు, మురుగునీరు తమ ఇంటి పునాదుల వద్ద చేరి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఫిర్యాదు చేసి నెల రోజులు దాటినా సంబంధిత శాఖ అధికారులు కనీసం క్షేత్రస్థాయిలో పరిశీలన కూడా చేయకపోవడం పట్ల బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది.అసంపూర్తిగా ఉన్న నాలా కారణంగా ఇంటి పునాది గోడలు నిరంతరం తడిసి పచ్చిబారిపోతున్నాయని, నిర్మాణ బలం రోజురోజుకూ దెబ్బతింటోందని బాధితుడు వాపోయారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని, భారీ వర్షాలు కురిస్తే ఇంటి గోడలు



కూలిపోయే ప్రమాదం కూడా లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్య ఒక్క ఇంటికే పరిమితం కాదని, తమ ఇంటితో పాటు సమీపంలోని మరో మూడు ఇళ్లకు కూడా ముప్పు పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం ఎప్పుడు సంభవిస్తుందోనన్న భయంతో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని పేర్కొంటున్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.ప్రజావాణి వంటి వేదికల ద్వారా ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వెంటనే స్పందించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, ఈ ఘటనలో మాత్రం ఫిర్యాదు బుట్టదాఖలైనట్లు కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగాక స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకుని అసంపూర్తిగా ఉన్న నాలా నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజలకు భరోసా కల్పించాలని బాధితుడు దత్తాత్రి, స్థానికులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో డీసీహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీ

- **గర్భిణీలకు మెరుగైన వైద్యం అందించకపోతే చర్యలు తప్పవు**
- **వైద్యులకు డాక్టర్ కవిత హెచ్చరిక**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 17:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) డాక్టర్ కవిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీల కాన్పుల నిర్వహణకు సంబంధించి చోటుచేసుకున్న ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆమె, బాధ్యతాయుతంగా వ్యవహరించని వైద్య సిబ్బందిని మందలించారు.మూడు రోజుల క్రితం గర్భిణీ మహిళలకు వైద్య సేవల విషయంలో తలెత్తిన సమస్యలపై ఆసుపత్రి యాజమాన్యం, సంబంధిత వైద్యులను వివరణ కోరిన డాక్టర్ కవిత, ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా సేవలు అందించాలని సూచించారు.ఈ సందర్భంగా జహీరాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు నామా స్రవంతి రవికిరణ్, మజ్జిగ సుజిత విశ్వేశ్వర్ డీసీహెచ్ఎస్‌ను కలిసి గర్భిణీ స్త్రీల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రిలో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పలు కీలక సూచనలు చేశారు.ఆసుపత్రిలో ఎండీ అర్హత కలిగిన వైద్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, రేడియాలజీ విభాగానికి చెందిన వైద్యుడు కూడా నిరంతరం సేవలు అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. అదేవిధంగా, రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ సూచించారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ తనిఖీ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.



## ఘనంగా రావికంటి రామయ్య జయంతి




**మంథని వెలుతురు జూన్ 17:**

మంత్రకూట వేమన, ప్రజాకవి, రావికంటి రామయ్య గుప్త 90వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మంథనిలోని వారి కాంస్య విగ్రహానికి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మంథని మున్సిపల్ ఛైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ సహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శశి భూషణ్ కాచే, ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కొమురవెల్లి విజయ్ కుమార్, ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఎల్లంకి వంశీధర్ , రావికంటి రామయ్య తనయుడు, సీనియర్ జర్నలిస్ట్ రావికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంథని విద్యార్థి యువత వ్యవస్థాపకుడు కొండేల మారుతి ఆధ్వర్యంలో రావికంటి రామయ్య గుప్త సంస్మరణ సభ జరిగింది. ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల నియమితులైన కొమురవెల్లి విజయ్ కుమార్ ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

### రామయ్య కీర్తి అజరామరం : మున్సిపల్ ఛైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్

కవిత్వం, సాహిత్యం ద్వారా ప్రజలను చైతన్య పరిచిన రావికంటి రామయ్య కీర్తి అజరామరంగా నిలిచిపోతుందని మంథని మున్సిపల్ ఛైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ అన్నారు. ప్రజాకవిగా పేరొందిన ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఆర్య వైశ్య సంఘం నిర్వహించడం హర్షణీయమని ఆయన అన్నారు.

### మహామహుల నిలయం మంథని

మంథని గడ్డ అనేక మంది మహామహులకు జన్మనిచ్చిందని జిల్లా పెన్షనర్ల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు రామడుగు మారుతి అన్నారు. వారందరి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. వారిని స్మరించడం ద్వారా భావితరాలు స్ఫూర్తి పొందుతాయని అభిప్రాయపడ్డారు. వారి చరిత్రను అక్షరబద్ధం చేయాల్సిన అవసరం ఉందని రావికంటి శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు కొండేటి మారుతి మాట్లాడుతూ రావి కంటి రామయ్య ఉపాధ్యాయుడిగా, కవిగా తనదైన ముద్ర వేశారన్నారు. మంథని ప్రముఖుల చరిత్రను వెలుగులోకి తీసుకు రావడానికి చాలా కాలంగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. కొమురవెల్లి విజయ్ కుమార్, సత్యనారాయణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఆజంఖాన్, రావికంటి సదానందం, మాడిశెట్టి సుదర్శన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ములుగు ఏజెన్సీ జిల్లాలో తొలి ప్రైవేట్ ఐటీ కంపెనీ ప్రారంభం

- **గ్రామీణ యువతకు స్థానికంగానే ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించాలి**
- **అభివృద్ధి, ఉపాధి అవకాశాలు వికేంద్రీకరణ ద్వారానే ప్రతి ప్రాంతానికి చేరాలి**
- **ములుగులో ఐటీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుంది**
- **రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**ములుగు జిల్లా వెలుతురు జూన్ 17:**





ములుగు ఏజెన్సీ జిల్లాలో తొలిసారిగా ప్రైవేట్ రంగంలో ఐటీ సంస్థ ఏర్పాటు కావడం సంతోషకరమని, గ్రామీణ ప్రాంత యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సాంకేతిక రంగంలో కొత్త భవిష్యత్తుకు దారులు వేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రియా ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇప్పటివరకు ఐటీ రంగం ప్రధానంగా నగరాలకు మాత్రమే పరిమితమైందని, ఐటీ అవకాశాలు గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలకు కూడా చేరుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి అన్నీ ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కాకుండా వికేంద్రీకరణ జరిగితేనే మారుమూల ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు లభిస్తాయని తెలిపారు.శ్రియా ఇన్ఫోటెక్ సంస్థ గత ఒక సంవత్సరం కాలంగా ములుగు ప్రాంత యువతకు వివిధ రంగాల్లో సాంకేతిక శిక్షణ అందిస్తూ, యాప్ డెవలప్‌మెంట్ వంటి ఆధునిక నైపుణ్యాలను నేర్పిస్తూ ముందుకు సాగుతోందన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా యాప్‌లను అభివృద్ధి చేసి వివిధ పాఠశాలలు, సంస్థలు, ఐటీ రంగానికి సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థలో సుమారు 15 మంది యువత ఐటీ రంగంలో ఉద్యోగాలు పొందడం అభినందనీయమన్నారు.హైదరాబాద్ వంటి నగరాలకు మాత్రమే ఐటీ పరిశ్రమలు పరిమితం కాకూడదని, ములుగు, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం వంటి ప్రాంతాల్లో కూడా ఐటీ రంగం విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.నేటి సాంకేతిక యుగంలో ఎక్కడి నుంచైనా పని చేసే అవకాశాలు ఉన్నాయని, అభివృద్ధి, ఉద్యోగాల వికేంద్రీకరణ ద్వారానే సమాజంలో సమాన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.ములుగు జిల్లాలో ఇతర ఐటీ సంస్థలు, కంపెనీలు స్థాపించడానికి ముందుకు రావాలని, పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని విధాల సహకారం అందిస్తుందని తెలిపారు.శ్రియా ఇన్ఫోటెక్ వ్యవస్థాపకులు రవికుమార్ రంగారి తీసుకున్న ఈ ముందడుగు అభినందనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో సంస్థ మరింత విస్తరించి మరెందరో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రేగ కళ్యాణి, ములుగు మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, శ్రియా ఇన్ఫోటెక్ వ్యవస్థాపకులు రవికుమార్, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జీ7 సదస్సులో మోదీమెలోని హల్చల్

- **బ్రెజిల్, దక్షిణ కొరియా మద్దతు.. గ్లోబల్ సవాళ్లపై ఉమ్మడి పోరు**
- **ట్రంప్, ఫ్రెడ్రిక్ లతో కలిసి రౌండ్ టేబుల్ భేటీలో ప్రధాని మోదీ**
- **పలు దేశాల అధినేతలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు**
- **అమెరికా-ఇరాన్ ఒప్పందానికి జీ7 జై.. అంతర్జాతీయ భద్రతపై కీలక తీర్మానాలు**

**కెనడా వెలుతురు జూన్ 17:**



అంతర్జాతీయ వేదిక జీ7 శిఖరాగ్ర సదస్సులో ఆసక్తికర దృశ్యాలు చోటుచేసుకున్నాయి. భారత్‌తో పాటు ప్రపంచ దేశాల మధ్య దౌత్య సంబంధాలు, వ్యూహాత్మక చర్చలతో పాటు ప్రపంచ నేతల మధ్య నడిచిన కొన్ని సరదా సంభాషణలు నెట్టింట మారుమోగుతున్నాయి. ముఖ్యంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిల మధ్య జరిగిన ఒక ఆసక్తికరమైన చాటింగ్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. సదస్సుకు విచ్చేసిన ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికిన మెలోని, "ఇన్‌స్టాగ్రామ్‌లో మనమే అత్యంత ఫేమస్ జంట" అని నవ్వుతూ అనడం అక్కడున్న మైక్‌లో రికార్డైంది. ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన స్నేహ బంధానికి, పరస్పర గౌరవానికి ఈ సరదా క్షణాలు అద్దం పడుతున్నాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.కెనడా వేదికగా జరుగుతున్న జీ7 సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిల భేటీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గత కొంతకాలంగా వీరిద్దరి మధ్య ఉన్న స్నేహపూర్వక దౌత్య సంబంధాలు అంతర్జాతీయంగా చర్చల్లో ఉంటున్నాయి. గతంలో మోదీ ఇటలీ వెళ్లినప్పుడు మెలోనికి ప్రత్యేకంగా 'మెలోడీ' టాఫీల ప్యాకెట్‌ను గిఫ్ట్‌గా ఇవ్వడం, అది కాస్తా 'మెలోడి' హ్యాష్ ట్యాగ్‌తో ట్రెండ్ అవ్వడం అందరికీ తెలిసిందే. తాజాగా ఈ సదస్సులో కూడా మెలోని హుషారుగా మోదీతో డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్ గురించి మాట్లాడటం, ఆ వీడియో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విట్టర్) వేదికలపై మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో దూసుకుపోతోంది.సదస్సులో కేవలం రాజకీయాలే కాకుండా నేతల వ్యక్తిగత అలవాట్లపై కూడా ఆసక్తికరమైన చర్చ నడిచింది. తాను నెల రోజుల క్రితమే ధూమపానం (స్మోకింగ్) పూర్తిగా మానేశానని మెలోని ఇతర దేశాల నాయకులకు చెబుతుండగా, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యప్ ఎర్డోగాన్ స్పందిస్తూ, "మీరు చాలా బాగున్నారు.. కానీ ధూమపానాన్ని పూర్తిగా దూరం పెట్టాల్సిందే" అని సలహా ఇచ్చారు. దీనిపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ నవ్వుతూ, "అది అసాధ్యం" అనడంతో మెలోని తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. "నేను గనుక పొగ తాగడం మానేస్తే అంత కలివిడిగా ఉండలేకపోవచ్చు.. అయినా నా చేతుల్లో ఎవరూ చావడం నాకు ఇష్టం లేదు" అంటూ ఆమె నవ్వులు పూయించారు.సరదా సంఘటనలు పక్కన పెడితే, ప్రపంచ భద్రతకు ముప్పుగా మారిన తీవ్రమైన అంశాలపై జీ7 నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా అంతర్జాతీయంగా సాగుతున్న డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు) అక్రమ రవాణా, నల్లధనాన్ని తెల్లధనంగా మార్చే మనీలాండరింగ్ నెట్‌వర్క్‌లు, ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న ఆర్గనైజ్డ్ క్రైమ్స్ (వ్యవస్థీకృత నేరాలు) అడ్డుకోవడానికి ఉమ్మడి కార్యాచరణను ప్రకటించారు. సముద్ర మార్గాల్లో భద్రతను కట్టుదిట్టం చేయడం, నేర ముఠాలకు అందుతున్న ఆర్థిక వనరుల మూలాలను దెబ్బతీయడం, ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థల్లో నేరగాళ్లు చొరబడకుండా గట్టి నిఘా ఉంచడం వంటి కీలక అంశాలపై దేశాధినేతలు ఒక అవగాహనకు వచ్చారు.సదస్సు ముగింపులో జీ7 దేశాలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో మాదకద్రవ్యాల సరఫరాపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వ్యాపారం వేగంగా విస్తరించడం వల్ల వివిధ దేశాల జాతీయ భద్రత, ఆర్థిక వ్యవస్థలు మరియు ప్రజాస్వామ్య వ్యవస్థల ఉనికికే ప్రమాదం వాటిల్లుతోందని హెచ్చరించారు. డ్రగ్ మాఫియాపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయడానికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ రకమైన అక్రమ రవాణాను కేవలం ఒక దేశం అణచివేయలేదని, సరఫరా మరియు వినియోగం రెండింటినీ నియంత్రించేలా అన్ని దేశాలు సమగ్ర విధానంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.జీ7 ప్రకటనకు సదస్సుకు ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన బ్రెజిల్, దక్షిణ కొరియా వంటి ప్రముఖ భాగస్వామ్య దేశాలు కూడా పూర్తి మద్దతు ప్రకటించాయి. ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ ఉత్పత్తి విపరీతంగా పెరగడం, అంతర్జాతీయ సరిహద్దుల్లో నేర ముఠాల కార్యకలాపాలు ముమ్మరం కావడం వల్ల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లు రోజురోజుకూ బలపడుతున్నాయని ఈ దేశాలు అంగీకరించాయి. ఇటువంటి ప్రపంచవ్యాప్త సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే కేవలం జీ7 దేశాలే కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థల మధ్య నిరంతర సమాచార మార్పిడి, రక్షణ రంగ సహకారం ఎంతో అవసరమని నేతలు అభిప్రాయపడ్డారు.ఫ్రాన్స్ ఆతిథ్యమిచ్చిన 52వ జీ7 శిఖరాగ్ర సదస్సులో రెండవ రోజు భారత ప్రధాని నరేంద్ర మోదీ చాలా బిజీగా గడిపారు. సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాని మోదీ ప్రపంచ అగ్రనేతల మధ్య కూర్చుని భారతదేశ గొంతుకను వినిపించారు. జీ7 అధికారికంగా విడుదల చేసిన ఫోటోల ప్రకారం.. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీకి ఎడమవైపు జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్, కుడివైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి, ఆర్థిక వృద్ధిపై భారతదేశం తరఫున మోదీ పలు కీలక సూచనలు చేశారు.సదస్సు మధ్యలో ప్రధాని నరేంద్ర మోదీ పలువురు ప్రపంచ నేతలతో విడివిడిగా ద్వైపాక్షిక సమావేశాలు జరిపారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా, అలాగే కెన్యా అధ్యక్షుడు విలియం రూటోలతో మోదీ వ్యక్తిగతంగా భేటీ అయ్యారు. ఆయా దేశాలతో భారతదేశానికి ఉన్న సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, పరస్పర పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు మరియు డిజిటల్ విప్లవంలో భాగస్వామ్యం వంటి వైవిధ్యమైన అంశాలపై ఈ చర్చలు జరిగాయి.బుధవారం జీ7 దేశాలు విడుదల చేసిన సంయుక్త డిక్లరేషన్‌లో పలు అంతర్జాతీయ వివాదాలపై స్పష్టతనిచ్చారు. అమెరికా–ఇరాన్ దేశాల మధ్య ఇటీవల కుదిరిన చారిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని జీ7 పూర్తిగా స్వాగతించింది. అలాగే ఉక్రెయిన్‌కు తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందని పునరుద్ఘాటించింది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడును అడ్డుకునేలా, అక్కడ అంతర్జాతీయ చట్టాల ప్రకారం స్వేచ్ఛాయుత వాతావరణం ఉండాలని స్పష్టం చేసింది. తైవాన్ జలసంధి, దక్షిణ చైనా సముద్రంలో బలవంతపు చర్యలను తప్పుపట్టింది. మరోవైపు గాజా ప్రాంతంలో మానవతా సహాయాన్ని పెంచాలని, లెబనాన్‌లో తక్షణమే కాల్పుల విరమణ అమలు కావాలని మరియు ఉత్తర కొరియా అణ్వాయుధాలను పూర్తిగా విడనాడాలని జీ7 దేశాలు గట్టిగా డిమాండ్ చేశాయి.

# ఉస్మానియాలో ర్యాగింగ్ కలకలం

- **12 మంది సీనియర్ విద్యార్థులపై వేటు**
- **6 నెలల పాటు కొనసాగనున్న సస్పెన్షన్**
- **డెంటల్ కాలేజ్ ప్రిన్సిపల్ సంచలన నిర్ణయం**
- **12 మందిపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు**
- **జూన్ 9న జరిగిన ఫిర్యాదుతో బయటపడ్డ వ్యవహారం**
- **హెచ్చరించిన 24 గంటల్లోనే మళ్లీ రెచ్చిపోయిన సీనియర్లు**
- **మద్యం, సిగరెట్లు తెప్పించుకుంటూ జూనియర్లకు నరకం**
- **భయంతో రూమ్‌లకే పరిమితమైన జూనియర్ విద్యార్థులు**
- **గతంలో సీసీ కెమెరాల ధ్వంసం.. రౌడీయిజం చేసిన విద్యార్థులు**
- **క్షమాపణలు చెప్పి నమ్మించి.. మళ్లీ నయవంచన**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 17:**



హైదరాబాద్ లోని ప్రముఖ ప్రభుత్వ ఉస్మానియా డెంటల్ కాలేజీలో తీవ్ర కలకలం రేపిన ర్యాగింగ్ ఉదంతంపై కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సర్జీవ్ సింగ్ యాదవ్ స్పందించారు. క్యాంపస్‌లో జూనియర్ విద్యార్థులను మానసికంగా, శారీరకంగా వేధిస్తూ నిబంధనలను అతిక్రమించిన 12 మంది ఫైనల్ ఇయర్, థర్డ్ ఇయర్ విద్యార్థులను కాలేజీ నుంచి సస్పెండ్ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ క్రూరమైన ర్యాగింగ్ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను, సీనియర్ల ఆగడాలను ఆయన మీడియాకు వివరించారు. కాలేజీ వాతావరణాన్ని చెడగొట్టేలా ప్రవర్తించే వారిపై చట్టపరంగా, విద్యాపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.ఉస్మానియా డెంటల్ కాలేజీలో గత కొన్ని రోజులుగా తెరవెనుక సాగుతున్న ర్యాగింగ్ పర్వం జూన్ తొమ్మిదో తేదీన అధికారికంగా బయటపడింది. కాలేజీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న కొందరు బీడీఎస్ విద్యార్థులు ధైర్యం చేసి, తమపై సీనియర్ విద్యార్థులు జరుపుతున్న ఆగడాల గురించి కాలేజీ యాజమాన్యానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిరంతర వేధింపుల వల్ల తాము చదువుకోలేకపోతున్నామని, తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కాలేజీ యాజమాన్యం తక్షణమే రంగంలోకి దిగింది.జూనియర్ విద్యార్థుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ స్పందించారు. ఆ రోజే సదరు ఫైనల్ ఇయర్ విద్యార్థులను తన ఛాంబర్‌కు పిలిపించి గట్టిగా మందలించారు. ర్యాగింగ్ నిరోధక చట్టాల గురించి వివరిస్తూ, మరోసారి ఇలాంటి పనులు చేస్తే క్రిమినల్ కేసులు అవుతాయని తీవ్రంగా హెచ్చరించారు. అయితే, కాలేజీ యాజమాన్యం అంతలా హెచ్చరించినప్పటికీ సీనియర్లలో ఏమాత్రం భయం కలగలేదు. ఆ హెచ్చరికలు జారీ చేసిన 24 గంటలు కూడా గడవకముందే, వారు అహంకారంతో జూనియర్లపై మరోసారి ర్యాగింగ్‌కు పాల్పడి తమ పాత బుద్ధిని చాటుకున్నారు.ర్యాగింగ్ పేరుతో సీనియర్లు చేసిన పనులను ప్రిన్సిపల్ తీవ్రంగా తప్పుపట్టారు. హాస్టల్ గదుల్లో ఉండే జూనియర్ విద్యార్థులను రాత్రి సమయాల్లో పిలిపించి, వారి చేత బలవంతంగా ఆల్కహాల్ (మద్యం సీసాలు), సిగరెట్లు బయటి నుంచి తెప్పించుకునేవారని తెలిపారు. అంతటితో ఆగకుండా హాస్టల్‌లోని కూలర్లలో నీళ్లు నింపడం, తమ వ్యక్తిగత పనులన్నీ జూనియర్ల చేత బానిసల్లా చేయించుకుంటూ తీవ్రంగా వేధించేవారని ప్రిన్సిపల్ వివరించారు. చదువుకోవడానికి వచ్చిన పిల్లలను ఇలాంటి పనులతో వేధించడం అత్యంత దుర్మార్గమని ఆయన మండిపడ్డారు.సీనియర్ల వేధింపుల తీవ్రత ఏ స్థాయిలో ఉందంటే.. కేవలం మొదటి సంవత్సరం విద్యార్థులే కాకుండా, మూడో సంవత్సరం చదువుతున్న కొందరు విద్యార్థులు కూడా వీరి భయానికి గురయ్యారు. హాస్టల్ గదుల నుంచి బయటకు వస్తే ఎక్కడ సీనియర్లు పట్టుకుని వేధిస్తారో, కొడతారో అనే భయంతో బాధితులు తమ రూమ్‌ల నుంచి బయటకు రావడానికి కూడా వణికిపోయేవారని ప్రిన్సిపల్ తెలిపారు. భయానక వాతావరణం కారణంగా విద్యార్థులు క్లాసులకు సరిగ్గా హాజరు కాలేకపోయారని, భోజనానికి కూడా ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు.ర్యాగింగ్‌కు పాల్పడిన ఈ విద్యార్థులపై గతంలోనూ ఎన్నో ఫిర్యాదులు ఉన్నాయని కాలేజ్ యాజమాన్యం వెల్లడించింది. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన న్యూ ఇయర్ వేడుకల నెపంతో హాస్టల్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ సీసీ కెమెరాలను వీరు ఉద్దేశపూర్వకంగా పగలగొట్టారని ప్రిన్సిపల్ చెప్పారు. తమ అక్రమాలు రికార్డు కాకూడదనే ఉద్దేశంతోనే వారు ఆ పనిచేసి, ఇతర విద్యార్థులను కూడా తీవ్రంగా ఇబ్బంది పెట్టారని తెలిపారు. ఆ సమయంలోనే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి కాలేజీ కమిటీ సిద్ధమైందని గుర్తు చేశారు.గత ఏడాది సీసీ కెమెరాల ధ్వంసం ఉదంతంలో సస్పెన్షన్‌కు గురికావాల్సిన సదరు విద్యార్థులు.. అప్పట్లో యాజమాన్యం కాళ్లవేళ్లపడి బతిమాలారని ప్రిన్సిపల్ తెలిపారు. తమ భవిష్యత్తు పాడవుతుందని, మరోసారి జీవితంలో ఇలాంటి తప్పులు చేయబోమని రాతపూర్వకంగా క్షమాపణ పత్రాలు ఇచ్చి నమ్మించారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాలేజీ యాజమాన్యం అప్పట్లో పెద్ద మనసుతో వారిని క్షమించిందని, కానీ వాళ్ల బుద్ధి ఏమాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ అదే తరహా రౌడీ ప్రవర్తనతో జూనియర్ల జీవితాలతో ఆటలాడుకున్నారని మండిపడ్డారు.హెచ్చరికలు దాటి ప్రవర్తించిన 12 మంది విద్యార్థులపై యాజమాన్యం ఈసారి ఎలాంటి దయాదాక్షిణ్యాలు చూపించలేదు. నిబంధనలను బూట్ల కింద తొక్కి ర్యాగింగ్‌కు పాల్పడినట్లు విచారణలో నిరూపణ కావడంతో, ఆ 12 మంది విద్యార్థులను కాలేజీ మరియు హాస్టల్ నుండి తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాలేజీలో క్రమశిక్షణను కాపాడటానికి, జూనియర్ విద్యార్థులకు భరోసా ఇవ్వడానికి ఈ కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదని యాజమాన్యం స్పష్టం చేసింది.ఈ కఠిన చర్యల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ఒక బలమైన సందేశాన్ని పంపినట్లు ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ తెలిపారు. పిల్లలను కేవలం కాలేజీలకు పంపించడమే కాకుండా, వారు హాస్టళ్లలో ఎలా ఉంటున్నారు, వారి ప్రవర్తన ఎలా ఉందనే విషయాలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ, బాధ్యత కూడా ఎంతో అవసరమని కాలేజ్ యాజమాన్యం అభిప్రాయపడింది. డాక్టర్లు కావాల్సిన విద్యార్థులు ఇలాంటి నేరపూరిత ప్రవృత్తి అలవాటు చేసుకుంటే ఊపేక్షించేది లేదని, భవిష్యత్తులోనూ ఉస్మానియా క్యాంపస్‌లో ర్యాగింగ్ రహిత వాతావరణాన్ని కొనసాగిస్తామని ఆయన నొక్కి చెప్పారు.

# భూసార పరీక్షలతోనే అధిక దిగుబడులు.. వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు చేయాలి

- చిలమామిడిలో డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం

**జహీరాబాద్ వెలుతురు జూన్ 17:**



వ్యవసాయ రంగంలో పెరుగుతున్న సవాళ్లను అధిగమించేందుకు రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని నిపుణులు సూచించారు. ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం చిలమామిడి గ్రామంలో డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో స్థిరమైన పోషక నిర్వహణ (సస్టైనబుల్ న్యూట్రియెంట్ మేనేజ్‌మెంట్) మరియు వాతావరణ మార్పులకు తట్టుకునే వ్యవసాయం (క్లైమేట్ రెసిలియంట్ అగ్రికల్చర్) అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా భూసార శాస్త్ర నిపుణులు, ప్రోగ్రాం అసిస్టెంట్ (సాయిల్ సైన్స్) ఈ. స్వామి మాట్లాడుతూ పంటల సాగుకు ముందు భూసార పరీక్షలు నిర్వహించడం అత్యంత అవసరమని తెలిపారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను సమతుల్యంగా వినియోగించడం ద్వారా పంట దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయాలు తగ్గుతాయని పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా నేల ఆరోగ్యం మెరుగుపడి భూసార సారవంతత పెరుగుతుందని వివరించారు.భూసార ఆరోగ్య కార్డులలో నమోదైన వివరాలను రైతులు సక్రమంగా అర్థం చేసుకుని వాటి ఆధారంగా పోషక నిర్వహణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు భూసార ఆరోగ్య కార్డులు, పత్తి, సోయాబీన్, కందులు (రెడ్‌గ్రామ్) వంటి ప్రధాన పంటలకు భూసార పరీక్షల ఆధారంగా రూపొందించిన ఎరువుల సిఫార్సులను పంపిణీ చేశారు.వ్యవసాయ విస్తరణ విభాగానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ పి. సాయి ప్రియాంక రైతులకు నేల తేమ సంరక్షణ, పంటల మార్పిడి, అంతర పంటల సాగు, సీడ్ బాల్ విత్తన పద్ధతులు, వాతావరణ అనుకూల పంట ప్రణాళికలపై అవగాహన కల్పించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. అలాగే డీడీఎస్–కేవీకే ద్వారా రైతులకు అందిస్తున్న శిక్షణలు, సాంకేతిక సేవల గురించి వివరించారు.వ్యవసాయ శాఖ ఏఈఓ వేదవతి ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, రైతు నమోదు ప్రక్రియ, రైతులకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు.అనంతరం రాబోయే సాగు సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై రైతులతో పరస్పర చర్చ నిర్వహించారు. రైతులు తమ సందేహాలను నిపుణులతో చర్చించి నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి. జైరాజు, డీడీఎస్ సూపర్‌వైజర్ సంపత్, మహిళా రైతులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం 65 మంది రైతులు (42 మంది పురుషులు, 23 మంది మహిళలు) పాల్గొని కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందారు.

# ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో సిల్ట్ తొలగింపు పనులను పర్యవేక్షించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూన్ 17:**



కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం 22, 33, 41 మరియు 50వ డివిజన్లలో నిర్వహిస్తున్న మురుగు కాలువల సిల్ట్ తొలగింపు పనులను మేయర్ ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను పూర్తిస్థాయిలో తొలగించి, వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు కాలువల శుభ్రపరిచే పనులను మరింత వేగవంతం చేయాలని, ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, అందరూ పరిశుభ్రతకు సహకరించాలని మేయర్ కోరారు.నగర అభివృద్ధి, పరిశుభ్రత కోసం ప్రభుత్వం మరియు నగరపాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నగరంలోని అన్ని డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, నాంపల్లి రేణుక శ్రీనివాస్, హీనా ఆఫ్రిన్, ఏపీపీ చంద్ర, కో–ఆప్షన్ సభ్యులు బల్బీర్ సింగ్, అసిస్టెంట్ కమిషనర్ సువార్త, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు ఆయా డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

# "బడిబాట - మనబడి, మన బాధ్యత" కార్యక్రమంలో విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ

**కరీంనగర్ వెలుతురు జూన్ 17:**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారి పిలుపుమేరకు నిర్వహిస్తున్న "బడిబాట – మనబడి, మన బాధ్యత" కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు 2వ డివిజన్ తీగలగుట్టపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఉచిత పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను మేయర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యా ప్రమాణాల్లో ముందంజలో నిలవడం ఆనందదాయకమని పేర్కొన్నారు.అలాగే గత సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారి సహకారంతో 10వ తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రమశిక్షణను అలవరచుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని మేయర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి కరుణ గారు, శ్రీనివాస్ రెడ్డి గారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నరహరికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

- ఏసీబీ కోర్టు ఆదేశాలతో చంచల్‌గూడ జైలుకు తరలింపు
- అవినీతి ఆరోపణల కేసులో నరహరిరావు అరెస్టు
- హైదరాబాద్‌లోని నివాసంలో కట్టలు కట్టలుగా నగదు స్వాధీనం
- 11 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన ఏసీబీ
- రూ.13.05 కోట్ల విలువైన అక్రమాస్తులు గుర్తింపు
- పత్రాల పరిశీలనలో వెలుగుచూసిన భారీ ఆస్తులు
- హైదరాబాద్ శివార్లలో విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు గుర్తింపు
- బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ రూ.100 కోట్లకు పైమాటేనన్న అంచనా
- ఏసీబీ కోర్టు న్యాయమూర్తి నివాసంలో నిందితుడి హాజరు
- అక్రమాస్తులపై దర్యాప్తు మరింత ముమ్మరం చేసిన అధికారులు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 17:**



తెలంగాణ 'సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డులు' మల్టీజోన్–2 ఉపసంచాలకుడు సుంకరి నరహరిరావుకు ఏసీబీ కోర్టు న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో అరెస్టు చేసిన నరహరిరావును బుధవారం ఉదయం ఏసీబీ అధికారులు న్యాయమూర్తి నివాసంలో హాజరుపర్చగా, రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయనను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు.హైదరాబాద్ పాతబస్తీలోని ఛత్రినాక ప్రాంతంలో ఉన్న నరహరిరావు నివాసంలో నిర్వహించిన సోదాల్లో భారీ మొత్తంలో నగదు, విలువైన ఆస్తుల పత్రాలు వెలుగుచూడటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. మంగళవారం ఏసీబీ అధికారులు ఆయన ఇంటితోపాటు మరో 11 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కట్టలు కట్టలుగా నగదు, బ్యాంకు డిపాజిట్లు, బంగారు ఆభరణాలు, స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.సోదాల అనంతరం స్వాధీనం చేసుకున్న నగదు, ఆస్తులు, ఇతర పెట్టుబడులను కలుపుకుని నరహరిరావుకు చెందిన అక్రమాస్తుల విలువ రూ.13.05 కోట్లుగా ఏసీబీ అధికారులు ప్రాథమికంగా లెక్కగట్టారు. అయితే, ఆయన అధీనంలో ఉన్న భూములు, ప్లాట్లు, ఇతర స్థిరాస్తులు హైదరాబాద్ శివార్లలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఉండటంతో వాటి వాస్తవ మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.ప్రత్యేకించి నగర పరిసర ప్రాంతాల్లో ఉన్న భూముల ప్రస్తుత మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకుంటే నరహరిరావు ఆస్తుల విలువ రూ.100 కోట్లకు పైగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా ఆస్తుల అసలు విలువ, వాటి కొనుగోలు విధానం, ఆదాయ వనరులపై ఏసీబీ అధికారులు లోతుగా విచారణ చేపట్టారు.సర్కారు ఉద్యోగిగా ఉన్న నరహరిరావు తన చట్టబద్ధ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు వచ్చిన ఆరోపణలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. సోదాల్లో లభించిన ఆధారాల ఆధారంగా ఆయనను అరెస్టు చేసిన అధికారులు, తదుపరి దర్యాప్తును వేగవంతం చేశారు. ఆయన కుటుంబ సభ్యులు, బినామీల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలను కూడా సేకరిస్తున్నట్లు సమాచారం.ఇక సోదాల్లో స్వాధీనం చేసుకున్న నగదు, ఆస్తుల పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, పెట్టుబడులపై అధికారులు సమగ్ర పరిశీలన చేస్తున్నారు. అక్రమాస్తుల కేసులో మరికొందరి పాత్ర ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసు భూ రికార్డుల శాఖలో అవినీతి వ్యవహారాలపై మరోసారి చర్చకు దారితీసింది.రిమాండ్ విధించడంతో నరహరిరావును చంచల్‌గూడ జైలుకు తరలించిన అధికారులు, తదుపరి విచారణ కోసం కస్టడీ కోరే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు పూర్తయిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

# దుబ్బాక అభివృద్ధికి 201 లక్షల కేంద్ర నిధులు మంజూరు

- దళిత, గిరిజన కాలనీలకు ప్రత్యేక నిధులు
- సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి వినియోగం
- ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు
- దుబ్బాక గ్రామాల్లో మౌలిక వసతుల పెంపు
- ఎంపీ కృషితో నిధుల మంజూరు
- బీజేపీ నేత పల్లె వంశీ కృష్ణ గౌడ్

**దుబ్బాక వెలుతురు జూన్ 17:**

దుబ్బాక నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి 201 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు బీజేపీ నేత పల్లె వంశీ కృష్ణ గౌడ్ తెలిపారు.మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు కృషితో ఎన్ ఆర్ ఈ జీ ఎస్ నిధుల ద్వారా ఈ నిధులు మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఒక్కో గ్రామానికి 5 లక్షల నుంచి 8 లక్షల రూపాయల వరకు కేటాయించినట్లు తెలిపారు.ఈ నిధులతో కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామాభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఓట్ల తొలగింపు వెనుక పెద్ద కుట్ర

- ముస్లింల ఓట్లే కేంద్రం టార్గెట్
- బెంగాల్, బిహార్ తరహాలోనే అక్రమాలు
- మీ ఓటును మీరే కాపాడుకోవాలి
- ప్రజలకు మంత్రి అజారుద్దీన్ పిలుపు
- గత ప్రభుత్వ పెండింగ్స్ క్లియర్..
- విద్యారంగంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ
- పేదల సమస్యల పరిష్కారమే లక్ష్యం..
- పబ్లిసిటీపై మోజు లేదన్న మంత్రి
- ప్రజల దరఖాస్తులపై తక్షణ చర్యలు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 17:**

తెలంగాణ రాజకీయాల్లో ఓట్ల తొలగింపు వ్యవహారం కలకలం రేపుతోంది. ఓటర్ల జాబితా సవరణ లేదా 'సర్' ప్రక్రియ పేరుతో మైనార్టీల, ముఖ్యంగా ముస్లింల ఓట్లను పెద్ద ఎత్తున తొలగించేందుకు తెరవెనుక కుట్రలు జరుగుతున్నాయంటూ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం 'గాంధీభవన్'లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సర్' ప్రక్రియ అనేది అందరికీ వర్తించే సాధారణ అంశంలా కనిపించినప్పటికీ, దీని వెనుక కేవలం ముస్లిం ఓటర్లనే లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని కొన్ని ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి వ్యూహాలతోనే కొన్ని శక్తులు రాజకీయ లబ్ధి పొందాయని, తెలంగాణలోనూ అలాంటి ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.గాంధీభవన్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన మంత్రి అజారుద్దీన్, ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. 'సర్' ప్రక్రియ ద్వారా ముస్లింల ఓట్లను జాబితా నుంచి తొలగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. ఈ ప్రక్రియ అందరి ఓటర్లకు సంబంధించినదే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఒక నిర్దిష్ట వర్గం ఓట్లను ఏరిపారేయడానికి దీనిని ఆయుధంగా వాడుకునే ముప్పు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అధికారులు, రాజకీయ శక్తులు ఎలా వ్యవహరిస్తున్నాయనే దానిపై నిరంతరం నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.గతంలో ఇతర రాష్ట్రాల్లో జరిగిన కొన్ని రాజకీయ పరిణామాలను మంత్రి అజారుద్దీన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాలలో ముస్లింల ఓట్లను వ్యూహాత్మకంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించడం ద్వారానే బీజేపీ అక్కడ రాజకీయంగా లాభపడిందని, అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. అదే తరహా దుష్ట సంప్రదాయాన్ని, కుట్రలను ఇప్పుడు తెలంగాణ గడ్డపై కూడా అమలు చేసేందుకు కొన్ని శక్తులు లోపాయికారీగా ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని మైనార్టీ ఓటు బ్యాంకును దెబ్బతీయడం ద్వారా ఇక్కడి రాజకీయ సమీకరణాలను మార్చాలనేది వారి ప్లాన్ అని దుయ్యబట్టారు.

ఈ 'సర్' ప్రక్రియ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రజలు, ముఖ్యంగా మైనార్టీ సోదరులు ఎంతో జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అధికారులు ఇళ్లకు వచ్చినప్పుడు సరైన సమాచారం ఇవ్వాలని, ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో క్రమబద్ధంగా తనిఖీ చేసుకోవాలని కోరారు. ఎవరి ఓటును వాళ్లే బాధ్యతగా కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఎన్నికల్లో గెలుపోటములు అనేవి కేవలం కొన్ని వందలు, వేల ఓట్ల తేడాతోనే మారిపోతాయని, ఇలాంటి తరుణంలో ఓట్లను అక్రమంగా తొలగిస్తే అది ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అవుతుందని మంత్రి అజారుద్దీన్ స్పష్టం చేశారు.తన రాజకీయ, వ్యక్తిగత శైలి గురించి మాట్లాడుతూ.. తాను ఎప్పుడూ ఎలాంటి మొహమాటం లేకుండా నిజాయితీగానే మాట్లాడతానని అజారుద్దీన్ అన్నారు. తనకు తెలుగు భాషపై పూర్తి గౌరవం ఉందని, తెలుగు రాయడం, చదవడం వచ్చని వివరించారు. అయితే, చిన్నప్పుడు తెలుగు రాయడం, చదవడం ప్రాక్టీస్ చేసినప్పటికీ.. బహిరంగంగా మాట్లాడేటప్పుడు మాత్రం కొంత ఇబ్బందిగా అనిపిస్తుందని ఒప్పుకున్నారు. తెలుగులో మాట్లాడేటప్పుడు ఎక్కడైనా తప్పులు దొర్లితే అనవసరమైన వివాదాలు అవుతాయని, అందుకే తనకు సులువుగా, స్పష్టంగా వచ్చే భాషలోనే (ఉర్దూ/ఇంగ్లీష్/హిందీ) మాట్లాడటానికి మొగ్గు చూపుతానని ఆయన సరదాగా పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తోందని మంత్రి అజారుద్దీన్ కొనియాడారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమర్థవంతమైన



నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకుపోతోందని, రాష్ట్ర ప్రజలకు ఒక అద్భుతమైన, అవినీతి రహిత పాలన అందిస్తున్నామని వ్యాఖ్యానించారు. తాము చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాలు ఎన్ని అనవసర విమర్శలు చేసినా, తాము ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అందిస్తామని స్పష్టం చేశారు.తెలంగాణలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని మంత్రి అజారుద్దీన్ ఉద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పూర్తిగా పెండింగ్‌లో పెట్టి నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కానీ, తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పెండింగ్ నిధులన్నింటినీ విడుదల చేస్తూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తోందని చెప్పారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి నిరంతరం ప్రజా సేవలోనే గడుపుతున్నానని అజారుద్దీన్ తెలిపారు. తన వద్దకు వచ్చే ప్రతి పేదవాడికి న్యాయం చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నానని, ఇప్పటికే ఎన్నో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించానని చెప్పారు. తనకు అనవసరమైన పబ్లిసిటీ, హంగూ ఆర్భాటాలపై అస్సలు మోజు లేదని, తెరవెనుక ఉండి ప్రజలకు మేలు చేయడమే ఇష్టమని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో జరిగిన 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమానికి భారీ స్పందన వచ్చిందని, అనేకమంది పేదలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువచ్చారని వివరించారు.బుధవారం జరిగిన ప్రజా దర్బార్ లేదా ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా దాదాపు 200 మందికి పైగా బాధితులు తమ వివిధ సమస్యలను పరిష్కరించాలంటూ మంత్రి అజారుద్దీన్‌కు స్వయంగా దరఖాస్తులు సమర్పించారు. ఈ వినతి పత్రాలను పరిశీలించిన మంత్రి.. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా, వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పేదలను తిప్పించుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి అజారుద్దీన్ హెచ్చరించారు.

# మహిళల చేతుల్లో ప్రగతి రథచక్రం

- మహిళా శక్తి పథకం - బస్సులను ప్రారంభించి, స్వయంగా నడిపిన మంత్రి జూపల్లి
- మహిళా సాధికారిత ప్రభుత్వ లక్ష్యం

**కొల్లాపూర్, వెలుతురు జూన్ 17:**

చిన్నంబావి మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి ఆర్టీసీ బస్సులను పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ప్రొహిబిషన్ & అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టీరింగ్ పట్టి బస్సును కొద్దిదూరం నడిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు డ్రైవింగ్ చేయడంతో అధికార యంత్రాంగం, కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నిండింది. అనంతరం లబ్ధిదారులతో ముచ్చటించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి, ఆదాయ వనరులు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు బస్సుల పంపిణీ ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వారి ఆర్థిక స్వావలంబన మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.మహిళల సంక్షేమం, సాధికారత కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత ముందుకు సాగాలని లబ్ధిదారులకు సూచించారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలని కోరారు. అప్పుడే ఆర్టీసీ లాభాల బాటల్లో పయనిస్తుందని తెలిపారు. మరిన్ని సర్వీసులు గ్రామీణ ప్రాంతాలకు రావడానికి వీలవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళ సంఘాల సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# జూన్ 21 న జరుగనున్న నీట్ పరీక్ష ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి






**మేడ్చల్ జిల్లా వెలుతురు జూన్ 17:**

జూన్ 21 న జరుగనున్న నీట్ పరీక్ష (నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ పరీక్షకు జిల్లా నుండి 3 వేల 311 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లో ఉన్న నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభర్థులకు కరెంట్, మంచినీరు అందుబాటులో ఉంచాలని, కేంద్రాల వద్ద పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైద్య అధికారులు మెడికల్ కిట్, అంబులెన్సలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిరంతరాయ విద్యుత్తు సరఫరా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్ వంటి వాటిని అందుబాటులో ఉండేలా డిడబ్ల్యూఓ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డిఓలు వెంకట్ రెడ్డ, శ్యాంప్రకాష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అల్పాహారం కార్యక్రమానికి జిల్లాలో 22 పాఠశాలల ఎంపిక

**మేడ్చల్ జిల్లా వెలుతురు జూన్ 17:**



ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం కార్యక్రమానికి జిల్లాలో 22 పాఠశాలల ఎంపికైన సందర్భంగా కేంద్రీకృత వంటగది నిర్మాణానికి గాను స్థల సేకరణ నిమిత్తం ఆలియాబాదు, కేశవరం లోని మూసిఉన్న బిసి ప్రీమెట్రిక్ హాస్టల్స్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అంతటా అల్పాహారాన్ని అందించే విధంగా ఉండేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణానికి గాను స్థల పరిశీలనకై శామీర్ పేట్, మూడుచింతలపల్లి మండలాలలోని హాస్టల్స్ ను తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ హాస్టల్స్ ఎప్పటి నుండి మూసి ఉన్నాయని, ఎంత స్థలం ఉందని బిసి వెల్ఫేర్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ రెండు హాస్టల్స్ స్థల వివరాల నివేదికను తనకు అందజేయాలని సంబంధిత ఎంఆర్ఓలకు సూచించారు. అనంతరం కేశవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసారు. విద్యార్థులు ఎంత మంది హాజరైనారని సంబంధితగ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ విద్యా సంవత్సరంలో ఎన్నికొత్త అడ్మిషన్లు అయ్యాయని అడిగారు. పిల్లలతో ముచ్చటిస్తూ భోజనం ఎలా ఉంది, ఆడుకోవడానికి పరికరాలు ఉన్నాయా, ఏమైనా కావాలా అని విద్యార్థులను అడుగగా, ఫుట్ బాల్, క్రికెట్ కిట్లు కావాలని విద్యార్థులు కోరగా, కలెక్టర్ అందిస్తామన్నారు. ఈ పర్యటనలో జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీరాణి, శామీర్ పేట్ ఎంఆర్ఓ శ్రీనివాస్, మూడుచింతలపల్లి ఎంఆర్ఓ మహమ్మద్ ఇద్రీస్, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అల్పాహార నిర్వహణ కాంట్రాక్టు ఏజెన్సీ మన్న ట్రస్ట్ వారితో కలెక్టర్ మాట్లాడుతూ వివరాలు అడిగి తెలుసుకొని అవసరమైన సలహాలు సూచనలు అందజేసారు.

# రాజేంద్రనగర్‌లో ఘనంగా "నమో GENZ కాన్క్లేవ్" పోస్టర్ ఆవిష్కరణ!

**రాజేంద్రనగర్ వెలుతురు జూన్ 17:**

రాజేంద్రనగర్ నియోజకవర్గం ఉప్పర్‌పల్లి బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం రోజున "నమో GENZ కాన్క్లేవ్" పోస్టర్‌ను పార్టీ ముఖ్య నాయకులు ఘనంగా ఆవిష్కరించారు.

**ముఖ్య ఉద్దేశం:**

యువతలో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావాన్ని పెంపొందించడం.గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో గత 12 ఏళ్లుగా దేశం సాధించిన అభివృద్ధి, సుశాసనం, యువత సాధికారతను GenZ (యువత) ముందుకు తీసుకెళ్లడం.

**పిలుపు:**

యువత అంతా అధిక సంఖ్యలో ఈ కాన్క్లేవ్‌లో



పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. హాజరైన ముఖ్య నాయకులు ఈ కార్యక్రమానికి జిల్లా బీజేపీ అధ్యక్షులు పంతంగి రాజభూపాల్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, వారితో పాటు బొక్కా బాల్‌రెడ్డి, మయందర్ మల్లారెడ్డి, మల్లేశ్ యాదవ్, విజయ్, బీజేపీ యువ మోర్చా జిల్లా ఇన్‌చార్జ్ రవీందర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి అభినయ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, రాకేష్ గౌడ్, మణికాంత్, పవన్, భూపాల్ ముదిరాజ్ తదితర నాయకులు, యువ మోర్చా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్రతుకుదెరువు కోసం చేపట్టిన గౌడ వృత్తి బ్రతుకులనే బలితీసుకుంటోంది: గోపా డివిజన్ అధ్యక్షులు

- వేముల మల్లేశం, భాదిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా వెంటనే అందించాలి - సమ్మిగౌడ్
- 3 రోజుల్లో ముగ్గురు గౌడన్నల బ్రతుకుల్లో విషాదం బాధాకరం - సమ్మిగౌడ్ చిలువేరు
- ఇంటావిడ తాళి చేతిలో పట్టుకొని గౌడన్న కోసం ఎదురుచూపు నరకం - కేజీకేఏస్ మోడెం వెంకటేశ్వర్లు





**కేసముద్రం వెలుతురు జూన్ 17:**

కేసముద్రం మండలంలో వరుసగా జరుగుతున్న గీత కార్మికుల ప్రమాదాలు గౌడ కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బ్రతుకు దెరువు కోసం చేపట్టిన గౌడ వృత్తి నేడు బ్రతుకులనే బలి తీసుకుంటోందని అన్నారు. కుటుంబ పోషణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి తాటి చెట్లను నమ్ముకొని జీవనం సాగిస్తున్న గౌడన్నలు అదే తాటి చెట్ల కారణంగా ప్రాణాలు కోల్పోతుండటం అత్యంత బాధాకరమన్నారు.తమ భర్తలు పొద్దున వృత్తి రీత్యా బయటకు వెళ్లిన వాళ్ళు తిరిగి నవ్వుతూ ఇంటికి వచ్చే వరకు తాళి చేతిలో పట్టుకొని చూసే వాళ్ళ ఎదురుచూపులు మాటల్లో వర్ణించలేనివని ఆవేదన వ్యక్తం చేసారు.గత కొద్ది రోజుల వ్యవధిలోనే కేసముద్రం మండలంలో చోటుచేసుకున్న వరుస ప్రమాదాలు పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయన్నారు. కేసముద్రం గ్రామానికి చెందిన ఉట్కూరి శ్రీనివాస్ గౌడ్ తాటిచెట్టుపై నుంచి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు మెదడులో రక్తం గడ్డకట్టిందని, చేతులు, కాళ్లు విరిగిపోయి ప్రస్తుతం హన్మకొండలోని ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. అలాగే ఇంటికన్నె గ్రామానికి చెందిన సార రాజు తాటిచెట్టుపై నుంచి కిందపడటంతో వెన్నెముక, పక్కటెముకలు విరిగి తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమై చికిత్స పొందుతున్నారని అన్నారు.ఇక తాజాగా కల్వల గ్రామానికి చెందిన వేముల మల్లేశం తాటిచెట్టుపై నుంచి జారిపడి మృతి చెందడం గౌడ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న చిలువేరు సమ్మయ్య గౌడ్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన ఆయన, పంచనామా ప్రక్రియ పూర్తయ్యే వరకు అక్కడే ఉండి కుటుంబానికి అండగా నిలిచారు. కుటుంబ పోషణ కోసం పనికి వెళ్లిన వ్యక్తి తిరిగి శవంగా ఇంటికి చేరడం హృదయ విదారకమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్, మోడెం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "ఉదయం కుటుంబం కోసం పనికి వెళ్లిన గౌడన్న సాయంత్రానికి క్షేమంగా ఇంటికి చేరుతాడో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి ఇచ్చిన తాటి చెట్టును నమ్ముకొని తరతరాలుగా జీవిస్తున్న గౌడన్నలు, నేడు అదే తాటి చెట్లపై ప్రాణాలు కోల్పోతున్నారు. పూట గడవాలంటే చెట్టు ఎక్కాలి... ప్రాణం దక్కాలంటే అదృష్టం ఉండాలి అనే పరిస్థితి గౌడ కుటుంబాలను వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేసారు..మృతి చెందిన వేముల మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారి కుటుంబానికి తక్షణ సహాయం కింద ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 10 లక్షల ఎక్సగ్రేషియా ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.. అలాగే ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న ఉట్కూరి శ్రీనివాస్ గౌడ్ మరియు సార రాజులకు 5 లక్షల ఎక్సగ్రేషియా తోపాటు వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వం భరించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రతి గీత కార్మికుడికి నాణ్యమైన సేఫ్టీ బెల్టులు, భద్రతా పరికరాలు, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా అందించాలని డిమాండ్ చేశారు. తాటి చెట్లు ఎక్కే కార్మికులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. తాటి చెట్ల ఎత్తును తగ్గించే విధానాలతో పాటు ఆధునిక గీత పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు.గౌడ సంఘం తరపున గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి గీత కార్మికుడు భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించేలా చైతన్యం తీసుకువస్తామని చిలువేరు సమ్మయ్య గౌడ్ తెలిపారు. గౌడ కుటుంబాల భద్రత కోసం సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

# తెలంగాణ SC స్టడీ సర్కిల్ నుంచి UPSC ప్రిలిమ్స్‌లో 30 మంది అభ్యర్థుల విజయఢంకా

- సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన ఫలిస్తోంది
- దళిత, బడుగు బలహీన వర్గాల యువతకు సివిల్ సర్వీసెస్‌లో నూతన ఒరవడి
- సంకల్పం సీఎం రేవంత్ గారిది ... సక్సెస్ స్టోరీ తెలంగాణ SC స్టడీ సర్కిల్‌ది
- దేశ అత్యున్నత సేవల్లోకి దూసుకెళ్తోన్న ఎస్సీ ఎస్టీ సర్కిల్ యువత
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 17:**



సామాజిక న్యాయం, సమాన అవకాశాలు మరియు నాణ్యమైన కోచింగ్ ద్వారా బలహీన వర్గాల యువతను దేశ అత్యున్నత సేవల్లోకి తీసుకురావాలన్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి సంకల్పం ఫలితంగా తెలంగాణ SC స్టడీ సర్కిల్ మరోసారి విశిష్ట ఫలితాలను నమోదు చేసిందని తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖల గౌరవ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు తెలిపారు.ఇటీవల 15.06.2026న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC) విడుదల చేసిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్–2026 మరియు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (IFoS) ప్రిలిమినరీ పరీక్షల ఫలితాలలో తెలంగాణ SC స్టడీ సర్కిల్‌కు చెందిన ఇప్పటి వరకు 26 మంది అభ్యర్థులు UPSC సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల్లో, 4 మంది అభ్యర్థులు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (IFoS) ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించడం గర్వకారణమని మంత్రి గారు పేర్కొన్నారు.అదేవిధంగా, UPSC సివిల్ సర్వీసెస్ పరీక్ష–2025 తుది ఫలితాలలో తెలంగాణ SC స్టడీ సర్కిల్‌కు చెందిన శ్రీ ఎ. ఆశిష్ (AIR-676) మరియు శ్రీ డి. ప్రవీణ్ కుమార్ (AIR-793) తుది ఎంపిక సాధించడం విశేషమని, వీరికి భారత పోలీసు సేవ (IPS) లభించే అవకాశం ఉందని తెలిపారు.ఇక ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (IFoS) తుది ఫలితాలలో శ్రీ డి. శశాంక్ (అఖిల భారత 78వ ర్యాంకు) మరియు శ్రీ జి. శ్రీకాంత్ (అఖిల భారత 115వ ర్యాంకు) సాధించిన విజయాలు రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి గారు పేర్కొన్నారు.సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన దళిత, గిరిజన బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన యువత దేశ అత్యున్నత సేవల్లో స్థానం సంపాదించేలా ప్రత్యేక కోచింగ్, అధ్యయన సామగ్రి, వసతి, ఆర్థిక సహాయం మరియు నిపుణుల మార్గదర్శకత్వంతో కూడిన శిక్షణా కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు విద్య, ఉపాధి, సాధికారతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ బలహీన వర్గాల యువతను జాతీయ స్థాయిలో పోటీపడేలా రూపొందిస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా ఇటువంటి ప్రతిష్టాత్మక శిక్షణా కార్యక్రమాలకు అవసరమైన నిధులను సకాలంలో మంజూరు చేసి, అన్ని వర్గాల అభ్యున్నతికి అండగా నిలుస్తున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి, గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారికి మంత్రి గారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.UPSC సివిల్ సర్వీసెస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ తుది ఎంపిక సాధించిన అభ్యర్థులతో పాటు ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులందరికీ మంత్రి గారు అభినందనలు తెలియజేస్తూ, రాబోయే మెయిన్స్ పరీక్షల్లోనూ అత్యుత్తమ విజయాలు సాధించి తెలంగాణకు మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు ఈ విజయాలకు తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీ నరసింహ రెడ్డి గారి సమర్థవంతమైన నాయకత్వం, అంకితభావంతో కూడిన కృషి, అధ్యాపక బృందం అందించిన నాణ్యమైన శిక్షణ, మార్గదర్శకత్వం, అలాగే విద్యార్థుల నిరంతర శ్రమ, క్రమశిక్షణ మరియు పట్టుదల ప్రధాన కారణాలని పేర్కొన్నారు. పోటీ పరీక్షల్లో బలహీన వర్గాల యువత అత్యున్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో స్టడీ సర్కిల్ సిబ్బంది, ఫ్యాకల్టీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ విద్యార్థులకు సమగ్ర శిక్షణ అందిస్తున్నారని ఆయన తెలిపారు.అదేవిధంగా, భవిష్యత్తులో మరింత మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ వర్గాలకు చెందిన యువత UPSC, IFoS, Group-I, Group-II మరియు ఇతర ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల్లో విజయాలు సాధించేలా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. బలహీన వర్గాల యువతను దేశ పరిపాలనా వ్యవస్థలో కీలక స్థానాలకు చేర్చడం ద్వారా సామాజిక సాధికారతను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో మున్నూరు కాపు సంఘం సన్మాన సభ

- మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 17:**





రవీంద్రభారతిలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, వైస్ చైర్మన్ అల్లం భాస్కర్‌లకు ఈ సందర్భంగా ఘన సన్మానం నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన నేతలకు అభినందనలు తెలిపారు. బీసీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మున్నూరు కాపు సమాజ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

కోకాపేటలో మున్నూరు కాపు భవనానికి రూ.5 కోట్లు మంజూరు చేస్తామని, ఈ నెలలోనే లోన్ ప్రొసీడింగ్స్ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి అవసరమని, కింది స్థాయి కుటుంబాలకు విద్యా సహకారం అందించాలని సూచించారు.కరీంనగర్, వేములవాడ, కాచిగూడలో ఉన్న మున్నూరు కాపు సత్రాలు, హాస్టల్ విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. మున్నూరు కాపు సమాజం నుంచి మరింత మంది ఐఏఎస్‌లు రావాలని ఆకాంక్షించారు.బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అల్లం భాస్కర్‌లు తనకు ఆప్తులని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేసి మున్నూరు కాపు ఐక్యతను పెంచాలని సూచించారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, శ్యామ్ మోహన్‌తో పాటు మున్నూరు కాపు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# బహుజనుల ఓట్లు మావే... అధికారం మాత్రం మీదేనా?

**భారతదేశం స్వాతంత్ర్యం సాధించి 78 సంవత్సరాలు దాటిపోయాయి.**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, అనేక భాషలు, మతాలు, సంస్కృతులు, జాతులు, ప్రాంతాలు కలిసిన సమాఖ్య గణతంత్రంగా మన దేశం తన ప్రత్యేకతను ప్రపంచానికి చాటుకుంటోంది. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందని, సామాజిక న్యాయం మన ప్రజాస్వామ్యానికి ప్రాణమని, అణగారిన వర్గాల అభ్యున్నతే దేశ అభివృద్ధికి పునాదని రాజకీయ పార్టీలు తరచూ చెబుతుంటాయి. కానీ స్వాతంత్ర్యానంతర భారత రాజకీయ చరిత్రను ఒకసారి నిజాయితీగా పరిశీలిస్తే ఒక అసౌకర్యకరమైన ప్రశ్న మన ముందుకు వస్తుంది. దేశ జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఎంబీసీలు, మైనార్టీలు నిజంగా ఈ దేశ అధికార నిర్మాణంలో భాగస్వాములయ్యారా? లేక ఎన్నికల సమయంలో అవసరమైన ఓటు బ్యాంకులుగా మాత్రమే మిగిలిపోయారా?

ఈ ప్రశ్న కేవలం కాంగ్రెస్ లేదా బీజేపీకి మాత్రమే సంబంధించినది కాదు. దేశ రాజకీయ వ్యవస్థ మొత్తానికి సంబంధించినది. స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రస్తుతం కేంద్ర అధికారాన్ని చేపట్టిన బీజేపీ వరకు, సామాజిక మార్పు గురించి మాట్లాడిన కమ్యూనిస్టు పార్టీల వరకు ప్రతి రాజకీయ శక్తి ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే సామాజిక న్యాయం గురించి గొప్పగా మాట్లాడటం ఒక విషయం, ఆ న్యాయాన్ని అధికార నిర్మాణంలో అమలు చేయడం మరో విషయం.

భారతదేశంలో రాజకీయ చర్చ ఎక్కువగా సంక్షేమ పథకాల చుట్టూ తిరుగుతుంది. ఎవరెంత రేషన్ ఇచ్చారు, ఎవరెంత పెన్షన్ ఇచ్చారు, ఎవరెంత సబ్సిడీ ఇచ్చారు అనే విషయాలు ప్రచారంలో ప్రధానంగా కనిపిస్తాయి. కానీ అసలు ప్రజాస్వామ్యం అక్కడితో ముగియదు. ప్రజాస్వామ్యం అంటే కేవలం సంక్షేమం కాదు, అధికారంలో భాగస్వామ్యం కూడా. నిర్ణయాధికారంలో వాటా కూడా. దేశ భవిష్యత్తును నిర్ణయించే వేదికలపై సమాన స్థానం కూడా. అదే నిజమైన సామాజిక న్యాయం.

దేశ జనాభాలో బీసీలు అతిపెద్ద సామాజిక వర్గం. ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు కలిస్తే భారతదేశంలో స్పష్టమైన మెజారిటీ సమాజం ఏర్పడుతుంది. కానీ ఈ మెజారిటీ సమాజం రాజకీయ అధికార నిర్మాణంలో అదే స్థాయిలో కనిపిస్తుందా? ప్రధానమంత్రి కార్యాలయం నుంచి కేంద్ర మంత్రివర్గం వరకు, పార్టీ జాతీయ అధ్యక్ష పదవుల నుంచి కీలక నిర్ణయాధికార సంస్థల వరకు, న్యాయవ్యవస్థ నుంచి ఉన్నత పరిపాలనా వ్యవస్థల వరకు చూస్తే జనాభా నిష్పత్తికి అనుగుణమైన ప్రాతినిధ్యం కనిపిస్తున్నదా? అనే ప్రశ్నను తప్పించుకోవడం కష్టం.

కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం గురించి ఎన్నో దశాబ్దాలుగా మాట్లాడుతోంది. బీజేపీ సబ్కా సాథ్, సబ్కా వికాస్ అనే నినాదాన్ని వినిపిస్తోంది. కమ్యూనిస్టు పార్టీలు వర్గరహిత సమాజం గురించి, సమానత్వం గురించి మాట్లాడుతున్నాయి. కానీ ఒక సాధారణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, యువకుడు అడుగుతున్న ప్రశ్న మాత్రం చాలా సూటిగా ఉంది. మీరు మమ్మల్ని ఓటర్లుగా గుర్తిస్తున్నారు. కానీ నాయకులుగా గుర్తిస్తున్నారా? మమ్మల్ని ప్రచార సభలకు పిలుస్తున్నారు. కానీ నిర్ణయాధికార సమావేశాలకు పిలుస్తున్నారా? మా ఓట్లు మీకు అవసరం. అయితే మా నాయకత్వం ఎందుకు అవసరం కావడం లేదు?

ఇది రాజకీయ ప్రత్యర్థుల ప్రచారం వల్ల వచ్చిన ప్రశ్న కాదు. సామాజిక వాస్తవాల నుంచి పుట్టుకొచ్చిన ప్రశ్న. దేశంలో బహుజన సమాజం సంఖ్యాపరంగా మెజారిటీ అయినప్పటికీ అధికార పరంగా మైనారిటీగా ఎందుకు మిగిలిపోయిందనే ప్రశ్న.

ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీసీ వర్గానికి చెందిన నాయకుడు అని బీజేపీ తరచుగా చెబుతుంది. అది వాస్తవం. కానీ ఒక వ్యక్తి అత్యున్నత పదవిలో ఉండటం ద్వారా మొత్తం బీసీ సమాజానికి న్యాయం జరిగినట్టుగా భావించవచ్చా? అదే ప్రశ్నను కాంగ్రెస్‌కూ వర్తింప జేయాలి. ఒకరు ఇద్దరు నాయకులు ఎదగడం ద్వారా జనాభా నిష్పత్తికి అనుగుణమైన అధికార భాగస్వామ్యం ఏర్పడినట్టుగా చెప్పగలమా? సామాజిక న్యాయం అంటే ప్రతీకాత్మక ప్రాతినిధ్యమా? లేక వ్యవస్థాగత భాగస్వామ్యమా?ఇక్కడే అసలు చర్చ మొదలవుతుంది. ఎందుకంటే బహుజన సమాజం ఇప్పుడు సంక్షేమ పథకాలకే పరిమితం కావాలనుకోవడం లేదు. రాజకీయ వాటా కోరుతోంది. విధాన నిర్ణయంలో భాగస్వామ్యం కోరుతోంది. దేశాన్ని పాలించే హక్కు కూడా తమకుందని చెబుతోంది. ప్రజాస్వామ్యంలో ఇది సహజమైన డిమాండ్.అదే సమయంలో మరో ముఖ్యమైన ప్రశ్న దక్షిణ భారతదేశం నుంచి వినిపిస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన బలంగా నిలుస్తున్న రాష్ట్రాలు ఎక్కువగా దక్షిణ భారతంలోనే ఉన్నాయి. విద్య, ఆరోగ్యం, పారిశ్రామిక అభివృద్ధి, మానవ వనరుల నిర్మాణం, పన్నుల ఆదాయం, సాంకేతిక రంగ అభివృద్ధి వంటి అంశాల్లో తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. కానీ రాజకీయ అధికార పంపిణీలో ఈ ప్రాంతాలకు తగిన ప్రాధాన్యం దక్కుతోందా అనే అనుమానం పెరుగుతోంది.దక్షిణ భారత ప్రజలు అడుగుతున్న ప్రశ్న కూడా స్పష్టంగానే ఉంది. దేశ సంపద సృష్టించడంలో మా పాత్ర పెద్దది. దేశ అభివృద్ధికి మా సహకారం ఎక్కువ. కానీ దేశ రాజకీయ నిర్ణయాల్లో మా ప్రభావం ఎందుకు పరిమితంగా ఉంది? సమాఖ్య వ్యవస్థలో భాగస్వాములమా? లేక కేవలం సహాయకులమా?

ఈ ప్రశ్నలు కేవలం ప్రాంతీయ భావోద్వేగాల ఫలితం కావు. సమాఖ్య ప్రజాస్వామ్యం ఆరోగ్యంగా ఉందా లేదా అనే చర్చలో భాగం. ఒక ప్రాంతం నిరంతరం అధికార కేంద్రంగా మారి, మిగిలిన ప్రాంతాలు కేవలం అనుచరులుగా మిగిలిపోతే ప్రజాస్వామ్య సమతుల్యత దెబ్బతింటుంది. అందుకే దక్షిణ భారత ప్రజల ఆందోళనలను తేలికగా తీసుకోవడం సరైంది కాదు.ఇదే సందర్భంలో జాతీయ పార్టీల పాత్రపై మరింత లోతైన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దేశ సమగ్రత కోసం, జాతీయ ఐక్యత కోసం, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యాన్ని జాతీయ పార్టీలు తరచూ ప్రకటిస్తాయి. కానీ ఆ సమానత్వం వారి అంతర్గత నిర్మాణంలో కనిపిస్తుందా? పార్టీ అధ్యక్ష పదవులు, జాతీయ కార్యవర్గాలు, రాజకీయ వ్యవహారాల కమిటీలు, అభ్యర్థుల ఎంపిక కమిటీలు, సిద్ధాంత నిర్ణయ వేదికలు వంటి చోట్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణమైన స్థానం ఉందా?ఈ ప్రశ్న కాంగ్రెస్‌కే కాదు. బీజేపీకే కాదు. కమ్యూనిస్టు పార్టీలకూ వర్తిస్తుంది. వర్గపోరాటం గురించి మాట్లాడే కమ్యూనిస్టు పార్టీలు కూడా సామాజిక ప్రాతినిధ్య విషయంలో ఆదర్శంగా నిలిచాయా? వారి అగ్ర నాయకత్వ నిర్మాణాన్ని పరిశీలిస్తే బహుజన వర్గాలకు తగిన స్థానం లభించిందా? అనే ప్రశ్నకు వారు కూడా సమాధానం చెప్పాల్సిందే.ఎందుకంటే సామాజిక న్యాయం గురించి మాట్లాడే ప్రతి రాజకీయ శక్తి ముందు తన అంతర్గత నిర్మాణాన్ని ప్రజల ముందుంచాల్సిన బాధ్యత ఉంది. మాటల్లో సమానత్వం చెప్పడం సులభం. కానీ అధికారాన్ని పంచుకోవడం కష్టం. భారత రాజకీయాల్లో ఇప్పటికీ కనిపిస్తున్న ప్రధాన వైరుధ్యం కూడా ఇదే.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఊహించిన ప్రజాస్వామ్యం కేవలం ఓటు హక్కుతో పరిమితం కాలేదు. ఆయన సామాజిక ప్రజాస్వామ్యాన్ని కోరుకున్నారు. సమాన అవకాశాలు, సమాన గౌరవం, సమాన భాగస్వామ్యం ఆయన కల. రాజకీయ ప్రజాస్వామ్యం సామాజిక ప్రజాస్వామ్యంతో కలిసిపోకపోతే అది అసంపూర్ణమని ఆయన హెచ్చరించారు. నేడు బహుజన సమాజం లేవనెత్తుతున్న ప్రశ్నలు కూడా అదే హెచ్చరికను గుర్తు చేస్తున్నాయి.ప్రజాస్వామ్యం అంటే ప్రతి ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ప్రజాస్వామ్యం అంటే అధికారంలో వాటా. పాలనలో భాగస్వామ్యం. విధాన నిర్ణయంలో స్వరం. ఈ మూడు లేకపోతే ప్రజాస్వామ్యం రూపంలో ఉన్నా సారాంశంలో అసంపూర్ణంగానే మిగులుతుంది.

నేటి పరిస్థితుల్లో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు అడుగుతున్న ప్రశ్నలు భారత రాజకీయ వ్యవస్థను అసౌకర్యానికి గురిచేస్తున్నా వాటిని విస్మరించడం సాధ్యం కాదు. మేము దేశ జనాభాలో మెజారిటీ అయితే అధికారంలో కూడా అదే స్థాయి ప్రాతినిధ్యం ఎందుకు ఉండకూడదు? మేము దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడితే నిర్ణయాధికారంలో కూడా భాగస్వాములు ఎందుకు కాకూడదు? మేము ప్రజాస్వామ్యాన్ని నిలబెడితే ప్రజాస్వామ్య ఫలితాల్లో కూడా సమాన భాగస్వామ్యం ఎందుకు పొందకూడదు?ఈ ప్రశ్నలకు సమాధానం సంక్షేమ పథకాలలో లేదు. ఎన్నికల హామీలలో లేదు. ప్రతీకాత్మక పదవుల్లో కూడా లేదు. అసలు సమాధానం అధికార వికేంద్రీకరణలో ఉంది. నాయకత్వ అవకాశాల విస్తరణలో ఉంది. రాజకీయ పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యంలో ఉంది. సామాజిక వర్గాల మధ్య సమాన భాగస్వామ్యాన్ని నిర్ధారించే రాజకీయ సంకల్పంలో ఉంది.

జాతీయ పార్టీలు, కమ్యూనిస్టు పార్టీలు, ప్రాంతీయ పార్టీలు అన్న తేడా లేకుండా ప్రతి రాజకీయ శక్తి ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చింది. బహుజన వర్గాల పేరుతో ఓట్లు అడగడం సరిపోదు. అధికారంలో వాటా ఇవ్వాలి. నాయకత్వంలో భాగస్వామ్యం కల్పించాలి. నిర్ణయాధికారాన్ని పంచుకోవాలి. అదే నిజమైన సామాజిక న్యాయం. అదే రాజ్యాంగ స్ఫూర్తి. అదే సమాఖ్య భారతదేశ భవిష్యత్తుకు అవసరమైన మార్గం.లేకపోతే రాబోయే తరాలు మరింత కఠినమైన ప్రశ్నలు అడుగుతాయి. మా ఓట్లు మీకు అవసరం. కానీ మా నాయకత్వం ఎందుకు అవసరం కాదు? మా జనాభా మీకు కనిపిస్తుంది. కానీ మా హక్కులు ఎందుకు కనిపించవు? మేము దేశ నిర్మాణంలో భాగమైతే దేశ నాయకత్వంలో కూడా భాగం కావాలి కదా? అని ప్రశ్నిస్తాయి.

ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా భారత ప్రజాస్వామ్యం తనను తాను సంపూర్ణ ప్రజాస్వామ్యంగా ప్రకటించుకోలేదు. ఓటు హక్కు ఇచ్చిన ప్రజాస్వామ్యం, పాలించే హక్కును కూడా సమానంగా పంచుకున్నప్పుడే పరిపూర్ణ ప్రజాస్వామ్యంగా మారుతుంది. బహుజనుల శ్రమతో నిలిచిన దేశంలో బహుజనుల నాయకత్వం కూడా ప్రతిబింబించినప్పుడే సామాజిక న్యాయం సార్థకమవుతుంది. అదే భారత రాజ్యాంగం చూపించిన దారి. అదే సమానత్వ భారత నిర్మాణానికి అసలు పునాది.



**మన్నారం నాగరాజు**
**సామాజిక రాజకీయ విశ్లేషకులు**

## నిర్వహించడం సరికాదు - జాజుల లింగం గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 17:**



ఫీజు రీయంబర్స్మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వకుండానే ఈ నెల 19వ తేదీ నుంచి ఎప్‌సెట్ కౌన్సిలింగ్ నిర్వహించడానికి సిద్ధపడటం విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు.ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫీజు రీయంబర్స్మెంట్ అంశంపై ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఫీజుల భారం ఎంత ఉంటుందో తెలియని పరిస్థితుల్లో కౌన్సిలింగ్ నిర్వహించడం విద్యార్థులను అయోమయంలోకి నెట్టడమేనని విమర్శించారు.గతంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలన్నింటిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయంబర్స్మెంట్‌పై పూర్తి స్పష్టత ఇచ్చిన తర్వాతే ఎప్‌సెట్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వెంటనే జోక్యం చేసుకుని విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయంబర్స్మెంట్ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని.

## అమిత్ షా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ప్రతిపక్ష నేతలకు ఎర: జైరాం రమేష్ తీవ్ర ఆరోపణలు

**న్యూఢిల్లీ, వెలుతురు జూన్ 17:**



కేంద్ర హోం మంత్రి అమిత్ షా లక్ష్యంగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ బుధవారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ఏడాది లోక్‌సభలో డీలిమిటేషన్ (నియోజక వర్గాల పునర్విభజన) బిల్లులను ఆమోదింపజేయడంలో విఫలమై, ఎదురైన భంగపాటు మరియు అవమానం నుంచి తప్పించుకోవడానికే అమిత్ షా ప్రతిపక్ష నేతలను భారతీయ జనతా పార్టీలోకి లాక్కుంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు కేంద్ర హోం మంత్రి ఒక క్రమబద్ధమైన కుట్రపూరిత ప్రచారాన్ని నడుపుతున్నారని జైరాం రమేష్ విమర్శించారు.సోషల్ మీడియా వేదికగా అమిత్ షాపై విమర్శలు గుప్పించిన జైరాం రమేష్, కేవలం రెండేళ్ల క్రితమే బీజేపీ వ్యతిరేక నినాదాలతో ప్రజా తీర్పును పొంది గెలిచిన ప్రజాప్రతినిధులను సైతం ప్రలోభాలకు గురిచేసి పార్టీ మార్చేలా హోం మంత్రి ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. "ఈ ఏడాది ఏప్రిల్ 17న లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లులను పాస్ చేయించలేక అమిత్ షా తీవ్ర అవమానాన్ని ఎదుర్కొన్నారు. ఆ పరాభవాన్ని కప్పిపుచ్చుకోవడానికి, ప్రతిపక్షాలపై దాడి చేస్తూ భారత ప్రజాస్వామ్యాన్ని ఆయన ఖూనీ చేస్తున్నారు" అని జైరాం రమేష్ దుయ్యబట్టారు.ప్రతిపక్ష ఎమ్మెల్యేలను, రాజకీయ నాయకులను బీజేపీలోకి చేర్చుకోవడానికి మైండ్ బ్లాక్ అయ్యే రేంజ్‌లో ప్రలోభాలు, ప్యాకేజీలు ఎర వేస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రత్యర్థి పార్టీలను బలహీనపరిచేందుకు అమిత్ షా ఒక పథకం ప్రకారం రాజకీయ ఆపరేషన్ నడుపుతున్నారని విమర్శించారు. దీనిని మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమతో పోల్చిన జైరాం రమేష్, ఏ నేతకు ఏది అవసరమో చూసి, వారి వ్యక్తిగత రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా విభిన్నమైన ఆఫర్లను మరియు పథకాలను అమిత్ షా సిద్ధం చేస్తున్నారని, ఆయన దిగజారుడుతనానికి అసలు అవధులు లేకుండా పోయాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ పలుకుబడిని, అధికార బలాన్ని ఉపయోగించి ఇలాంటి ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని ప్రతిపక్షాలు నిరంతరం ఆరోపిస్తున్నప్పటికీ, బీజేపీ మాత్రం ఈ ఆరోపణలను తోసిపుచ్చుతోంది. తమ పార్టీ విధానాలు, నాయకత్వంపై నమ్మకంతోనే నేతలు స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారని అధికార పార్టీ వాదిస్తోంది. అయితే, ప్రతిపక్షాలను పూర్తిగా దెబ్బతీయాలనే అమిత్ షా అంతిమ వ్యూహం మరియు రాజకీయ లక్ష్యం ఎప్పటికీ నెరవేరబోదని, ఆయన ఈ ప్రయత్నాల్లో పూర్తిగా విఫలమవుతారని జైరాం రమేష్ ధీమా వ్యక్తం చేశారు.

## మామిడిగుండాల భూముల ఆక్రమణ యత్నాలను అడ్డుకోవాలి: తెలంగాణ ప్రజాఫ్రంట్

**ఖమ్మం, వెలుతురు జూన్ 17:**

ఇల్లందు మండలం మామిడిగుండాల పరిసర ప్రాంతాల్లో ఆదివాసీలు, పేద రైతులు సాగు చేస్తున్న భూములను భూస్వాములు ఆక్రమించుకునే ప్రయత్నాలను అడ్డుకోవాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెంతన సంజీవరావు డిమాండ్ చేశారు. మామిడిగుండాలలో నిర్వహించిన అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కుటుంబ వారసులకు గతంలో వేల ఎకరాల భూములకు పట్టాలు కల్పించారని, అనంతరం ప్రభుత్వం సీలింగ్ కింద భూములను రైతులకు పంపిణీ చేసిందన్నారు. ప్రస్తుతం లాటరైట్ ఖనిజ సంపద ఉన్న భూములను మళ్లీ ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గత వారం రోజులుగా పోలీసుల సహకారంతో భూముల చుట్టూ కందకాలు తవ్వుతూ రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. మామిడిగుండాల రైతులకు సాగు చేస్తున్న భూములపై హక్కులు కల్పించాలని, ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ, వ్యవసాయ శాఖ మంత్రులు వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. భూములు రైతులకు దక్కే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డిది పక్కా పొలిటికల్ డ్రామా

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ధ్వజం**
- **ఢిల్లీకి 71 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి**
- **అపాయింట్‌మెంట్లు దొరకట్లేదనడం పక్కా పొలిటికల్ డ్రామా**
- **కిషన్ రెడ్డిపై బురదజల్లడం బేస్ లెస్**
- **ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రజా వ్యతిరేకతను దాచడానికే కాంగ్రెస్ పబ్లిసిటీ స్టంట్లు**

**హైదరాబాద్, వెలుతురు జూన్ 17:**

కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్లు దొరకడం లేదంటూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు ముమ్మాటికీ పక్కా పొలిటికల్ డ్రామా అని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు బుధవారం తీవ్రంగా ఖండించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేంద్రంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఇప్పటివరకు 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేశారని, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌లతో పాటు పలువురిని అనేక సందర్భాల్లో కలిశారని గుర్తుచేశారు. అలాంటప్పుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని రాంచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, లెక్చరర్ల కొరత తీవ్రంగా వేధిస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి కీలకమైన ప్రజా సమస్యల నుంచి, ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి నుంచి దృష్టి మళ్లించేందుకే రేవంత్ రెడ్డి పబ్లిసిటీ స్టంట్లు చేస్తున్నారని విమర్శించారు. పరిపాలనపై దృష్టి పెట్టకుండా కేవలం ప్రచారానికే కాంగ్రెస్ పరిమితమైందని ధ్వజమెత్తారు.

మెట్రో ఫేజ్-2 సహా ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న విమర్శలను బీజేపీ అధ్యక్షుడు తిప్పికొట్టారు. సరైన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్స్, ప్రి-ఫీజిబిలిటీ నివేదికలు లేకుండా కేంద్ర ప్రభుత్వం ఏ ప్రాజెక్టుకూ నిధులు లేదా అనుమతులు మంజూరు చేయబోదని స్పష్టం చేశారు. కేంద్రం నిధులు ఇవ్వడానికి నిరాకరించడం లేదని, కేవలం నిర్ణీత నిబంధనలు, అధికారిక ప్రక్రియలను అనుసరించాలని మాత్రమే కోరుతోందని వివరించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక,



పెరిగిపోతున్న ప్రజా వ్యతిరేకతను దాచడానికే రేవంత్ సర్కార్ పదే పదే బీజేపీని, కేంద్రాన్ని బూచిగా చూపిస్తోందని




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com